
ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	34,204	34,204
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	5,015.38	5,015.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

రిజిస్ట్రేషన్ల శాఖలో షాడో ఆఫీసర్



- ఇతర సెక్షన్లపై అజమాయిషీ చేస్తున్న ఓ చిన్న సార్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న తోటి ఉద్యోగులు
- అస్తవ్యస్తంగా మారిన సెక్షన్లు
- జూనియర్లకే కీలక బాధ్యతలు అప్పగించడంతో సమస్యలు

జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యాలయంలో ఓ ఉద్యోగి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తోటి ఉద్యోగులపై పెత్తనం చేస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అతడికి సంబంధం లేని సెక్షన్లపైనా అజమాయిషీ చెలాయిస్తూ ఇతర ఉద్యోగుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎవరి సెక్షన్లకు వారే బాధ్యత వహించాలి. కానీ, ఎటువంటి సంబంధం లేకున్నా ఆ చిన్న సార్ వ్యవహరిస్తున్న తీరు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చెడ్డపేరు తీసుకొస్తోంది.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

రిజిస్ట్రేషన్లశాఖ ఉన్నతాధికారి పోస్టును ఇన్‌చార్జీలకు అప్పగించడం లేదా, పూర్తిస్థాయిలో వచ్చిన అధికారి తరచూ సెలవుల్లోకి వెళ్లడం, అది కాదంటే ఉన్నతాధికారులు బదిలీ అయిన సమయంలో తిరిగి ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగిస్తుండటంతో రిజిస్ట్రేషన్లశాఖ జిల్లా కార్యాలయంలో పాలన గాడి తప్పుతోంది. ఇన్‌చార్జీగా ఉన్న అధికారి ఏదో ఒక రోజు వచ్చి పోతుండటంతో ఇక్కడ ఉన్న ఆ చిన్న ఉద్యోగి ఆడిందే ఆటగా మారిందనే చర్చ శాఖలో ఉంది. ప్రభుత్వం అప్పగించిన పనిని సెక్షన్ల వారీగా నిర్వహించాల్సి ఉండగా, అన్నీ తానై చక్కబెట్టేందుకు ఇతరుల విధుల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజుల క్రితం ఉమ్మడి జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన ఆ ఉద్యోగి తన పలుకుబడితో నిబంధనలకు విరుద్ధంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి తిరిగి విధులో చేరడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడైనా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌లు లేకపోతే ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్‌ను నియమించాల్సి ఉండగా, జూనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జిగా నియమిస్తుండటంతో అవకతవకలు చోటు చేసుకోవడం ఆడపాదడపా సస్పెండ్ అవుతుండటం పరిపాటిగా మారింది. అయినా జూనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌లుగా నియమిస్తూ వివాదాలకు కారణమవుతున్నారు.

కోర్టులో కేసు ఉన్నా ఫైళ్లలో కదలిక

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి కోర్టుల్లో కేసులు ఉన్నా ఫైల్‌ను కదిలిస్తున్నట్లు తెలిసింది. సదరు ఉద్యోగి చేయితడిపితే చాలు ఎంతటి ఫైల్ అయినా తారుమారు చేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన సొసైటీల ఫైళ్లను ఇదేవిధంగా తారుమారు చేసి సొసైటీ సభ్యుల మధ్య విభేదాలకు దారితీసేలా చేయడం రచ్చకు దారితీసింది. కోర్టుల్లో కేసులు ఉన్న సమయంలో ఆ ఫైల్‌ను పక్కన పెట్టాలి. కానీ డబ్బు చేతులు మారడంతో వాటిని క్లియర్ చేసేలా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఇతర జిల్లాకు చెందిన ఓ అధికారిని నల్లగొండ జిల్లా రిజిస్ట్రేషన్ జిల్లా కార్యాలయ అధికారిగా నియమించిన సమయంలో సొసైటీల ఫైల్‌లను క్లియర్ చేసినట్లు అప్పట్లో ఆరోపణలు గుప్పుమన్నాయి. వాస్తవానికి సొసైటీలకు సంబంధించి ఆయా సభ్యుల మధ్య విభేదాలు వచ్చి కార్యాలయంలో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నప్పుడు ఉన్నతాధికారి విచారణ నిర్వహించి ఎవరివైపు న్యాయం ఉంటే వారికి అనుకూలంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ, ఈ సొసైటీ విషయంలో

మిగతా 8వ పేజీలో...

గ్రామీణ యువతకు ఉపాధి

- ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి కృషి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి





ఉద్యోగమేళాకు హాజరైన నిరుద్యోగులు, కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులకు ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించినట్లు నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో తెలంగాణ పరిశ్రమలు, డీట్, సింగరేణి కాలరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా జాబ్‌మేళాను మంత్రి ఉత్తమ్ ప్రారంభించి మాట్లాడారు. జాబ్‌మేళాకు 40వేల మందికి పైగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో మరో 10వేల మందికి పైగా హాజరయ్యారన్నారు. హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన జాబ్‌మేళాకు యువత నుంచి మంచి స్పందన లభించిందన్నారు. హైదరాబాద్ బయటి ప్రాంతంలో మొదటిసారిగా ఏర్పాటుచేసిన ఈ ఉద్యోగమేళాకు భారీగా నిరుద్యోగ యువత హాజరైందని పేర్కొన్నారు.

తెలంగాణ ఏర్పాటులో ముఖ్యమైన అంశాల్లో నిరుద్యోగ సమస్య ఒకటన్నారు. దాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 75వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇతర శాఖల్లో ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వరంగంతో పాటు ప్రైవేట్‌రంగంలో కూడా ఉపాధి కల్పించేందుకు దేశం, రాష్ట్రంలో పేరొందిన 275 కంపెనీలను జాబ్‌మేళాకు ఆహ్వానించామన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన పలువురికి ఆఫర్ లెటర్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందజేశారు.

నేటి మెగా జాబ్‌మేళా వాయిదా

కంపెనీల ప్రతినిధుల ఇబ్బందులు, సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో ఆదివారం నిర్వహించాల్సిన జాబ్‌మేళాను నెలరోజులు వాయిదా వేసినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. శనివారం రాత్రి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌మేళాకు 20,463 మంది యువతీ, యువకులు హాజరయ్యారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ధాన్యం దిగుమతుల్లో నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి ఎగుమతయ్యే ధాన్యం దిగుమతుల్లో మిల్లర్లు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. శనివారం మిర్యాలగూడ పరిసరాల్లోని పలు రైస్‌మిల్లుల్లో ధాన్యం ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించి, అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వానాకాలం ధాన్యం సేకరణలో భాగంగా మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలను తక్షణమే సమర్పించాలన్నారు. లేదంటే ధాన్యం సరఫరా నిలిపివేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ సేకరణలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మిల్లుపాయింట్ల వద్దకు వచ్చే ధాన్యం దిగుమతుల్లో కొర్రీలుపెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కనీస మద్దతు ధరను తగ్గించకుండా కొనుగోలు చేయాలని, ఈ విషయంలో అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. తుపాను ప్రభావంతో మిల్లుపాయింట్ల వద్దకు వచ్చే ధాన్యం తడిసే అవకాశం ఉందని, ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం రాశులకు వెంటనే కాంటాలు వేయాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీసీవో వెంకటేష్, సివిల్‌సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, మిర్యాలగూడ రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల్లో భద్రతకు ప్రాధాన్యం

ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వాణి



కమిషనర్ వాణిని సన్మానిస్తున్న ట్రస్మా ప్రతినిధులు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సుల్లో భద్రతకు యాజమాన్యాలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిస్ట్రిక్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వాణి అన్నారు. శనివారం ట్రస్మా ఆధ్వర్యంలో స్కూల్ బస్ డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డ్రైవర్లు క్రమశిక్షణ, జాగ్రత్తతో బస్సులు నడపాలన్నారు. రద్దీ ప్రదేశాలు, జాతీయ రహదారులపై పాటించాల్సిన కనీస జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్లు వాడకుండా, ఓవర్ స్పీడ్‌కు దూరంగా ఉంటూ విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. అనంతరం ఆమెను ట్రస్మా ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంవీఐ చంద్రశేఖర్, స్వప్న, శ్రీనివాస్, ట్రస్మా సభ్యులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసచారి, వరప్రసాద్, శ్యాంసుందర్, శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సలీం, వెంకట్, నర్సిరెడ్డి, దామోదర్, జయరాజు, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు లాటరీ రేపు

రామగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను జిల్లా కేంద్రంలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లాటరీ ప్రక్రియ ద్వారా మద్యం దుకాణాలను ఎంపికచేస్తామని తెలిపారు. 2025-27 సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 1,504 మద్యం దుకాణాలకు 4,906 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. టెండర్ దరఖాస్తులు అందజేసినవారు లాటరీ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

కాంటాలు వేయరు... ధాన్యం కొనుగోలు చేయరు

- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో తప్పని తిప్పలు
- ఆగ్రహించి రోడ్డెక్కిన అన్నదాతలు



మాడ్గులపల్లిలో జాతీయ రహదారిపై మొలకెత్తిన ధాన్యంతో ధర్నా చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. పెరిగిన ఎరువుల ధరలు, చీడపీడల బెడదలాంటి ప్రతికూల పరిస్థితులు రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తీరా పంటను కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే కాంటాలకు నోచక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఒకపక్క ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కాంటాల ప్రక్రియ నత్తనడకన సాగడం రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. మాడుగులపల్లి మండలంలోని 28 గ్రామాల్లో మొత్తం 18వేల మంది రైతులు 32,268 ఎకరాలను వరి సాగు చేయగా 8,600 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. ఎక్కువ మంది రైతులు దొడ్డురకం 1010 సాగు చేయడంతో గ్రేడ్‌-ఏ రకానికి ప్రభుత్వం మద్దతు ధర రూ.2389, సాధారణ రకానికి ధాన్యానికి రూ.2369 ప్రకటించింది. ఎక్కువ మంది రైతులు దొడ్డురకం సాగు చేయడంతో వర్షాలు సమృద్ధిగా కురవడం, దిగుబడి ఎక్కువగా రావడంతో సంతోషంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఓ వైపు వర్షం, మరోవైపు ఆరని ధాన్యం రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎక్కువ మంది రైతులు ప్రారంభంలోనే వరి పంటను కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగా 10 రోజుల ముందు కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ధాన్యంలో తేమశాతం చూసి సరిగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో కురుస్తున్న వర్షాలకు ఆందోళన చెందిన రైతులు చేసేదేమి లేక మొలకెత్తిన ధాన్యంతో మాడుగులపల్లి మండలకేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా చేపట్టారు. సుమారు గంట వరకు నిరసన తెలపడంతో మాడ్గులపల్లి టోల్ ప్లాజా వరకు ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కృష్ణయ్య, ఏవో శివరాంకుమార్‌లు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. కాగా, మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీసీవో పత్యానాయక్ పలు రికార్డులను పరిశీలించి రైతులు రోడ్డెక్కడానికి గల కారణాలను తెలుసుకొని సెంటర్ ఇన్‌చార్జిని సస్పెండ్ చేయడంతోపాటు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీఈవోకు షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. ఇక నుంచి రైతులకు లారీల కొరత లేకుండా చూడడంతోపాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సజావుగా కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

ధాన్యం తెచ్చి 20 రోజులు అవుతోంది



16 ఎకరాలను కౌలుకు తీసుకొని దొడ్డురకం పంట వేశాను. పంట కోసి 20 రోజులు అయింది. ఐకేపీలోకి తీసుకొచ్చి 20 రోజులు అవుతున్నా కాంటాలు పెట్టడంలేదు. వర్షాలు కురుస్తున్నందున తేమశాతం వచ్చిన వడ్లను వెంటనే కొనుగోలు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలి.

ఎరమాద సైదిరెడ్డి, రైతు, దాచారం

షరతులు లేకుండా కాంటాలు వేయాలి



షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి. ఒక వైపు వాతావరణం సహకరించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం తేమశాతం వస్తే వెంటనే కొనుగోలు చేయాలి. అధికారులు పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం మండల కేంద్రంలో చేపడ్తాం.

పుల్లెంల శ్రీకర్, మాడ్గులపల్లి

వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

కేతేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని నిర్ణీత తేమశాతంతో రాగానే వెంటనే కొనుగోలు చేసి వేగవంతంగా ఎగుమతి చేయాలని డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని గుడివాడ, కొత్తపేట గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం, ఇప్పటి వరకు కొనుగోలు, రవాణా చేసిన ధాన్య, కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం వివరాలను, రికార్డులను పరిశీలించారు. శుక్రవారం కురిసిన వర్షానికి కేంద్రంలోని ఎంత మంది రైతుల ధాన్యం తడిసిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తాలు, తేమ లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కాంటాలు వేసిన వెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలని సూచించారు. తేమశాతం, నాణ్యతాప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏపీఎం వలిశెట్టి మల్లేష్, సీసీ రమణయ్య, కమిటీ సభ్యులు రేణుక, నిర్మల, తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ

చిట్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకపోతుల రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం చిట్యాలలో జరిగిన గీత కార్మిక సంఘం జిల్లా మహాసభలో వారు మాట్లాడారు. గీత కార్మికులకు రూ.4వేల పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కరికి కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదన్నారు. రాష్ట్రంలో 760మంది గీత కార్మికులకు రూ.12.60కోట్ల ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉందన్నారు. 23వేల మంది గీత కార్మికులుంటే 20వేల మందికి కాటమయ్య రక్షణ కవచం(సేఫ్టీ కిట్స్) ఇచ్చారని తెలిపారు. రాష్ట్రమంతటా నీరా కేఫ్‌లు ప్రారంభించాలని, హైదరాబాద్ నెక్లస్‌రోడ్‌లో మూతపడిన నీరా కేఫ్‌ను తిరిగి ప్రారంభించాలన్నారు. యాదాద్రి జిల్లా నందనంలో తాటి ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. తాటి ఉత్పత్తులను ప్రభుత్వమే ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ సొసైటీకి ఐదెకరాల భూమి కేటాయించాలని, నాబార్డు ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు సూర్యాపేటలో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సంఘం జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామునగుల్ల అచ్చాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండా వెంకన్న, చెవగోని సీతరాములు, గంజి మురళి, బండ శ్రీశైలం, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, వెంకట్‌గౌడ్, పాల్గొన్నారు.



చండూరు మండలం తాస్కానిగూడెంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.24కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కేతేపల్లి క్రాస్‌రోడ్డు వరకు నిర్మించనున్న పట్టణ పోర్షన్‌రోడ్డు వెడల్పు పనులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పసునూరు నుంచి హైదరాబాద్ రోడ్డు వెంకటంపేట స్టేజీ వరకు రూ.25కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గురుపుజోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏవి.రెడ్డి, నాయకులు పూల వెంకటయ్య, రఘుపతిరెడ్డి, రిషిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటయ్య, పానగంటి వెంకటయ్య, ఎంపీడీవో శర్మ, ఎంఈవో రామకృష్ణ, నక్క యుగేందర్, పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్దతు ధర పొందాలి

(ఆంధ్రజ్యోతి, చండూరు రూరల్): రైతులు దళారుల వద్ద మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోన గుండ్రపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ప్రారంభించారు. అనంతరం తాస్కానిగూడెం గ్రామం నుంచి చండూరు పట్టణ కేంద్రం వరకు రూ.13కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులు, చండూరు మండలం ఇడికూడ గ్రామం నుంచి గట్టుప్పల మండలం తేరట్‌పల్లి వరకు రూ.30కోట్లతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో శ్రీదేవి, ఎంపీడీవో యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, నాయకులు పల్లె వెంకన్న, అనంత చంద్రశేఖర్‌గౌడ్, భూతరాజు అంజనేయులు, సుజావుద్దీన్, అబ్బనబోయిన లింగయ్య, లక్ష్మయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సూపర్ సక్సెస్

● ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన నిరుద్యోగులు ● 4,574 మందికి ఉద్యోగాలు ● రెండో రోజు జాబ్‌మేళా రద్దు



జాబ్‌మేళా సెంటర్‌లో కిక్కిరిసిన యువకులు

హుజూర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా సూపర్ సక్సెస్ అయింది. పట్టణంలోని పాత విజ్ఞాన్ స్కూల్, స్వర్ణవేదిక ఫంక్షన్‌హాల్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ పరిశ్రమలు, డీట్, తెలంగాణ సింగరేణి కాలరీస్ సంస్థల ఆధ్వర్యంలో మెగాజాబ్‌మేళా నిర్వహించారు. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహ వారం రోజులుగా పర్యటిస్తూ ఏర్పాట్లుచేశారు. మంత్రి ఉత్తమ్ నాలుగురోజుల పాటు పర్యటించి సలహాలు, సూచనలు అందించారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని వారికి ఉద్యోగం, ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంలో పేరొందిన కంపెనీలను ఈ జాబ్‌మేళాకు రప్పించారు. మొత్తం 275 కంపెనీలను ఆహ్వానించగా 259 కంపెనీల ప్రతినిధులు స్టాల్స్ ఏర్పాటుచేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఐటీ, ఫార్మ, విద్యా సంస్థలు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, ఆటోమొబైల్, లాజిస్టిక్ అండ్ ఎయిర్‌పోర్ట్ లాంటి కంపెనీలు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. జాబ్‌మేళాలో 20,500 మందికి పైగా యువత పాల్గొన్నారు. 50వేల మంది హాజరయ్యారు.

● ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మంత్రి ఉత్తమ్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ఈ జాబ్‌మేళాను నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్వర్ణవేదిక ఫంక్షన్‌హాల్‌లో అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ చేయించగా, పాత విజ్ఞాన్‌స్కూల్ ప్రాంగణంలో 259 కంపెనీలకు చెందిన హెచ్‌డీఈవోలు, సీఈవోలు, ఇతర ఉద్యోగులు ఇంటర్వ్యూలు చేశారు. కాగా 4,574 మంది ఉద్యోగాలు పొందారు. 3,041 మందికి ఉద్యోగ ఆఫర్ లెటర్లు అందజేశారు. దూర ప్రాంతాల నుంచి యువతీ, యువకులు, వివాహితలు జాబ్‌మేళాకు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగ యువతతో హుజూర్‌నగర్ జనసంద్రంలా మారిపోయింది. దారులన్నీ జాబ్‌మేళావైపే అన్నట్లుగా కనిపించాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 75 వేల ఉద్యోగాలు భర్తీచేయగా ప్రైవేట్ రంగంలోను ఉద్యోగ, ఉపాధి కల్పించేలా జాబ్‌మేళా నిర్వహించి సూపర్ సక్సెస్‌ను సాధించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా రెండురోజుల పాటు మెగాజాబ్‌మేళా నిర్వహించాలని అనుకున్నా ఐటీ కంపెనీల ప్రతినిధుల సాంకేతిక సమస్యలతో ఆదివారం నిర్వహించాల్సిన జాబ్‌మేళా వాయిదాపడింది. మరో నెలరోజుల్లో మరో ప్రాంతంలో జాబ్‌మేళా ఏర్పాటు చేయనున్నారు. కాగా జాబ్‌మేళా విజయవంతం కావడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. జాబ్‌మేళాలో ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 1000 ఉద్యోగులు, 500 మంది పోలీసులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సైతం జాబ్‌మేళా నిర్వహణకు సహాయ, సహకారాలు అందించారు. పెద్దఎత్తున వాలంటీర్లు నిర్వహణలో పాల్గొన్నారు.



జాబ్‌మేళా ప్రాంగణంలో భోజనాలు చేస్తున్న నిరుద్యోగులు

జాబ్‌మేళాకు విశేషస్పందన



హుజూర్‌నగర్‌లో మెగాజాబ్‌మేళాకు నిరుద్యోగులు తరలివచ్చారు. జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు వారికి కేటాయించిన స్టాల్స్ వద్ద వారి ఉద్యోగులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీంతో ఉద్యోగాల కోసం వచ్చిన యువతీ, యువకులు స్టాల్స్ వద్ద బారులు తీరారు. చాలా మందికి ఉద్యోగాలు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

(ఆంధ్రజ్యోతి-నేరేడుచర్ల)

రూ.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



ఉద్యోగ మేళా చాలా ఉపయోగపడింది. నాకు సూర్యాటెక్ సొల్యూషన్ ద్వారా టాటా ఎలక్ట్రానిక్స్‌లో రూ.3లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. కోదాడలో బీటెక్ చదువుతున్న నాకు ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది.

షేక్ రెహానా, చెన్నారం గ్రామం, వరంగల్

టాటా ఎలక్ట్రానిక్స్‌కు ఎంపికయ్యా



హెంప్ ట్రైబ్ యంగ్ ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్‌లో ఎంపికయ్యా. తనకు ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. దూరప్రాంతం నుంచి వచ్చిన నాకు ఇక్కడ జాబ్‌మేళా ఎంతగానో ఉపయోగపడింది. ఇంజనీరింగ్ చదువుతున్న తనకు పూర్తికాగానే జాబ్‌లో జాయిన్ అవుతా. రూ.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

డీ రమ్య, దేవరకద్ర, మహబూబ్‌నగర్

ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది



తనకు వీ సాఫ్ట్ కంపెనీలో రూ.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని ఉద్యోగం కోసం ఎదరు చూస్తున్న నాకు జాబ్‌మేళా ద్వారా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ఇలాంటి జాబ్‌మేళాలు ఎందరో నిరుద్యోగులకు వరంలాగా మారుతుండడం అభినందనీయం. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

కొణతం మేఘన, నేరేడుచర్ల

నారాయణలో రూ.2 లక్షల ప్యాకేజీ



నారాయణ విద్యాసంస్థల్లో నాకు ఉద్యోగం వచ్చింది. రూ.2 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం పొందా. ఫ్యాకల్టీగా ఉద్యోగం పొందినందుకు ఆనందంగా ఉంది. ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించాలి.

బాణోతు త్రివేణి, చిలుకూరు



జాబ్‌మేళాలో మంత్రి ఉత్తమ్‌తో సెల్ఫీలు దిగుతున్న మహిళా నిరుద్యోగులు



జాబ్‌మేళా ప్రాంగణంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, తేజస్‌నందలాల్‌తో ముచ్చటిస్తున్న మంత్రి ఉత్తమ్



బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

అమ్మలకు తోడుగా బామ్మలు

నేరేడుచర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాకు వివాహితలు, చంటి పిల్లల తల్లులు కూడా భారీగా తరలిరావడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లుచేశారు. కుమార్తెలు, మనుమరాళ్లు చంటిపిల్లలతో ఉద్యోగ వేటకు రావడంతో వారి వెంట తాతమ్మ, బామ్మ, అమ్మమ్మలు తోడుగా వచ్చారు. చిన్నపిల్లల ఆలనాపాలనా వారు చూసుకున్నారు. ప్రత్యేక ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటుచేయడంతో వాటి వద్ద చంటి పిల్లలతో వృద్ధులు సేద తీరారు.



చంటి పిల్లలతో తాతమ్మ

ఉమ్మడి జిల్లాలో విషాదాలు

● వివిధ కారణాలతో ఇద్దరి ఆత్మహత్య ● రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ● నదిలో జారిపడి మరొకరు ● విద్యుదాఘాతంతో యువకుడు మృతి

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలం కావడంతో ఓ యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెంలో జరిగింది. ఎస్‌ఐ నర్సిరెడ్డి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన గండికోట విఘ్నేష్(27) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఇటీవల ఆ యువతి విఘ్నేష్‌తో మాట్లాడం లేదు. దీంతో మనస్థాపానికి గురైన విఘ్నేష్ గ్రామానికి సమీపంలో ఓ వ్యవసాయబావి వద్ద రాత్రి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబసభ్యులు ఆలస్యంగా గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. విఘ్నేష్ తండ్రి రాందాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా యువతితో చనువుగా ఉన్న ఫొటోలను విఘ్నేష్ వాట్సప్ స్టేటస్‌గా పెట్టి ఆత్మహత్యకు పాల్పడాడు. ఆ ఫొటోలు గ్రామంలో వైరల్ అయ్యాయి.



విఘ్నేష్(ఫైల్)

క్షణికావేశంలో వివాహిత

కొండమల్లేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన శనివారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం దేవరేనితండా పరిధిలో జరిగింది. ఎస్‌ఐ అజ్మీర రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిషా రాష్ట్రంలోని లాతుర్ గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్, సంగీత భార్యాభర్తలు మండలంలోని దేవరేనితండాకు బతుకు దెరువు కోసం వచ్చి ఇస్లావత్ రాజునాయక్ కోళ్లఫారానికి ఐదురోజుల కిందట పనికి వచ్చాడు. ఇదే క్రమంలో శనివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో భార్యాభర్తలకు కుటుంబ విషయాల్లో గొడవ జరిగింది. భార్య సంగీతతో గొడవపడి దిలీప్ కిరాణం సామాను తెచ్చేందుకు కుమారుడితో కలిసి బయటకు వెళ్లాడు. అదేసమయంలో సంగీత(23) క్షణికావేశంలో కోళ్లఫారంలోని షెడ్డు పైకప్పుకు ఉరివేసుకుంది. సమీపంలో పొలంలో పనిచేస్తున్న కోళ్ల ఫారం యజమాని రాజు తల్లి ఇస్లావత్ బక్కమ్మ గమనించి కేకలు వేయడంతో అప్పుడే వచ్చిన భర్త దిలీప్ చూసేసరికే ఆమె మృతి చెందింది. సంగీతకు మూడేళ్ల కుమారుడు అయాన్ష్ ఉన్నారు. కోళ్ల ఫారం యజమాని రాజునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఇద్దరు..

నిడమనూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వెంకటన్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన ప్రకారం హాలియాలోని సాయిప్రతాప్‌నగర్‌కాలనీకి చెందిన ఎండీ మొహినొద్దీన్(50) స్థానిక ఆంజనేయ రైస్ మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మిర్యాలగూడ వెళ్లి పనిచూసుకుని రాత్రి ద్విచక్రవాహనంపై హాలియాకు బయల్దేరాడు. మండలంలోని వెంకటన్‌నగర్ సమీపంలోని స్పీడ్ బ్రేకర్లను తప్పించబోతుండగా వాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్సనిమిత్తం 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మొహినొద్దీన్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో కుమార్తె మృతి చెందినట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఉప్పు సురేష్ తెలిపారు.

గుర్రంపోడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జూనుతుల స్టేజీ సమీపంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం పీఏపల్లి మండలం దుగ్యాల గ్రామానికి చెందిన ఆడేపు వెంకటయ్య(52) ద్విచక్రవాహనంపై గుర్రంపోడులో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి జూనుతుల స్టేజీ సమీపంలో చెట్టును ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటయ్య కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



వెంకటయ్య(ఫైల్)

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

నాగార్జునసాగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో శివాలయానికి వెళ్లి అదృశ్యమైన పైలాన్‌కాలనీకి చెందిన ఆత్మకూరి రామలింగేశ్వరరావు(47) మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం సాగర్ శివాలయం ఘాట్ దిగువన జమ్మనకోటతండా వద్ద కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా శుక్రవారం అదృశ్యమైన రామలింగేశ్వరరావుగా గుర్తించారు. మృతదేహానికి కమలా నెహ్రూఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. శివాయలంలోకి వెళ్లేందుకు ముందు నదిలోకి దిగి కాళ్లు కడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి ఉంటాడని భావిస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



భాస్కర్‌రెడ్డి(ఫైల్)

మోత్కూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యాద్రాదిభువనగిరి జిల్లా మోత్కూరు మండలకేంద్రంలో విద్యుదాఘాతంతో శనివారం యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు(ఎం) మండలం పారుపెల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగ నర్సిరెడ్డి, శ్రీలత దంపతులకు ఇద్దరు కుమారులు కాగా భాస్కర్‌రెడ్డి(22) పెద్ద కుమారుడు. రెండు నెలలుగా మోత్కూరులోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో పనిచేస్తున్నాడు. శనివారం ట్రాన్స్‌ఫార్మర్ మరమత్మ్తు చేసిన అనంతరం దానిని పరిశీలించేందుకు విద్యుత్ మెయిన్‌స్విచ్‌ను ఆన్ చేయడంతో విద్యుదాఘాతానికి గురై స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే తోటి సిబ్బంది అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో పనిచేసి మానేశాడు. రెండు మాసాల కిందటే తిరిగి పనిలో చేరాడని సిబ్బంది తెలిపారు. అతడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

వ్యక్తి అదృశ్యం



భద్రయ్య

కేతేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన చిర్ర భద్రయ్య కుటుంబ సభ్యులతో కలహాలతో మనస్థాపం చెంది ఈ నెల 23న సాయంత్రం పొలం వద్దకు వెళ్లొస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ 8712670180, 8712667726లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గేదెలు పట్టివేత

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గేదెలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు. చిలుకలూరిపేట సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్ బహదూర్‌పేటకు డీసీఎంలో 26 గేదెలను తరలిస్తుండగా వలిగొండ ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహన డ్రైవర్ జహంగీర్, యజమాని అబ్దుల్లాపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన జీయర్ స్వామి రాక రేపు

చింతపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని మోద్గులమల్లేపల్లిలో ఈ నెల 27న సీతారామ చంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సమ్మిడి ప్రకాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ సమ్మిడి విజయరాంరెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా త్రిదండి చిన్నజీయర్ స్వామితోపాటు రాజకీయనాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రైతులకు అన్యాయం

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు, రహదారుల పేరుతో రైతుల భూములు తీసుకొని అన్యాయం చేస్తోందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో సంఘం జిల్లాస్థాయి కార్యకర్తల ప్రశిక్షణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు మూడేళ్లకు ఒకసారి నిర్వహించే సభ్యత్వ నమోదులో చేర్పించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు దోనూరు రాములు, మంత్రి మాదిరెడ్డి రాజిరెడ్డి, లావణ్యరెడ్డి, సాధునేని రవీందర్, వంగవీటి అంజిరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు రిమాండ్

నార్కట్‌పల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒంటరి మహిళలే లక్ష్యంగా బంగారు ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనాలు చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి సుమారు రూ.15లక్షల విలువైన 9.5 తులాల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కే.శివరాంరెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు. మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన బొలుగూరి శివ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 18వ తేదీన నార్కట్‌పల్లి మండలం దాసరిగూడెంలో ఉప్పుల సునీత అనే ఒంటరి మహిళపై దాడిచేసి పుస్తెలతాడును అపహరించుకుపోతుండగా గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడు శివను విచారించారు. జిల్లాలోని నార్కట్‌పల్లి, నల్లగొండ, మునుగోడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడిన నేరాల కింద 8 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. నల్లగొండ మండలంలోని అప్పాజిపేట, చర్లపల్లి, మునుగోడు మండలంలోని కల్వలపల్లి, నార్కట్‌పల్లి పీఎస్ పరిధిలోని పోతినేనిపల్లి, చెర్వుగట్టు జాతరలో, దాసరిగూడెంలలో ఒంటరి మహిళలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడ్డాడని డీఎస్పీ తెలిపారు. నల్లగొండలోని ఓ పత్రికా కార్యాలయం వద్ద, నార్కట్‌పల్లిలోని ఫ్లైఓవర్ బ్రిడ్జీ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేశాడన్నారు. కాగా నిందితుడిపై గతంలో చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోక్సో కేసు కూడా నమోదైందని తెలిపారు. నార్కట్‌పల్లి సీఐ నాగరాజు ఆధ్వర్యంలో చోరీ కేసు నిందితుడిని విచారించి బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నార్కట్‌పల్లి ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్, ఏఎస్‌ఐ ఆంజనేయులు, హెచ్‌సీలు జవహర్, బీ.రమేష్, పీసీలు ఎస్‌డీ జానీపాషా, బండి గిరిబాబు, కే.సత్యనారాయణ, సీహెచ్ కృష్ణ, సురేశ్‌గౌడ్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి పక్కన సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్

రూ.90 వేల నిషేధిత నల్లబెల్లం పట్టివేత

తిప్పర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిషేధించిన నల్లబెల్లాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు నల్లగొండ జిల్లా తిప్పర్తి ఎస్‌ఐ శంకర్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో శనివారం ఉదయం 5గంటల సమయంలో తిప్పర్తి శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ట్రాలీ వాహనాన్ని తనిఖీలో చేయగా సాధారణ బెల్లం బస్తాలను చూపించి వెళ్లేందుకు ప్రయత్నించారు. అనుమానస్పందంగా కనిపించడంతో ఎస్‌ఐ శంకర్ బస్తాలను పూర్తిగా పరిశీలించారు. వాహనంలో 60 బస్తాల్లో 2,880 కిలోల నల్లబెల్లాన్ని గుర్తించి సీజ్ చేశారు. దీని విలువ రూ.90 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నల్లబెల్లం రవాణా చేస్తున్న డ్రైవర్లు గురికళ్ళ హిమవత్తు, దూదేకుల ముబారక్, సహాయకుడు యన్నమల్ల సాయిలును అదుపులోకి తీసుకొని విచారించారు.నల్లబెల్లం రవాణాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలోతు శ్రీరామ్ కూడా ఉన్నట్లు తెలపడంతో అతడిని అదుపులోకి తీసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. విచారణలో నిందితులు ఈ బెల్లాన్ని వరంగల్ జిల్లాతో పాటు మరిపెడ బంగ్లా ప్రాంతానికి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించారని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



నిందితుల వద్ద పట్టుబడిన నిషేధిత నల్లబెల్లం

ఎన్‌హెచ్‌టీసీ యాప్‌ను వెంటనే తొలగించాలి

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్‌హెచ్‌టీసీ యాప్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్‌హెచ్‌టీసీ యాప్‌తో అంగన్‌వాడీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే యాప్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, జంగమ్మ, వసంత, శోభ, ప్రమీల, ఉమారాణి, మంగమ్మ పాల్గొన్నారు.

ఒంటికి యోగా మంచిదేగా...

● ఆరోగ్యమే మహాభాగ్యమంటున్న యోగా గురువులు

● నేడు నకిరేకల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

శరీరం, మనస్సు, శ్వాసలను సమన్వయపరిచి, ఆరోగ్యాన్ని, ఆత్మబలాన్ని, మానసిక శాంతిని అందించేదే యోగా. భారతీయ ప్రాచీన విజ్ఞానమైన యోగాను ప్రపంచమంతటికీ విస్తరించిన విషయం తెలిసిందే. యోగా అంటే ఏకమవ్వడమని, ఏకీకృతం చేయడమనే అర్థాలున్నాయి. జీవనశైలి మార్పులతో పాటు కూసింత సమయం కేటాయించి యోగాసనాలు వేస్తే ఎలాంటి రోగాలు దరిచేరవని, మందులు వేసుకునే అవసరమే రాదంటున్నారు యోగా గురువులు. తమకు తెలిసిన, తాము నేర్చుకున్న యోగాభ్యాసాలను పది మందికి అందించాలనే ఉద్దేశ్యంతో యోగాపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు గురువులు. ఆరోగ్య సమాజాభివృద్ధికి దోహదపడే విజ్ఞానాన్ని పంచడమంటే సమాజ సేవ చేయడమేనని వారు పేర్కొంటున్నారు.

విల్లులా వంచకపోయినా వయసు, వీలును బట్టి శారీరక కదలికలతో యోగాసనాలు వేయవచ్చని, చిన్న కదలికలే పెద్ద మార్పులు తెస్తాయి. నాకు సరిగా చేయరాదు. నలుగురు ఏమనుకుంటారోనని సందేహపడకుండా యోగా క్లబ్, శిబిరాలకు వెళ్తే ఊహించని రీతిలో దేహంలో మార్పులు కనిపిస్తాయని, ఆసనాలు వేయడంతో తర్ఫీదు పొందితే ఇంట్లో లేదా పెరట్లోనే సాధన చేయవచ్చని, ఆరోగ్యవంతులుగా మారవచ్చని యోగా టీచర్లు చెబుతున్నారు.



ఆసనాలు వేస్తున్న చిన్నారులు



సద్వినియోగం చేసుకోవాలి



యోగాసనాలు రోగ నిరోధక శక్తిని అందించడంతో పాటు అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇతర వ్యాయామాలు శరీరానికి మంచి చేస్తే యోగాసనాలు మనసుకు, ఆత్మకు మేలు చేస్తాయి. క్రమం తప్పకుండా ప్రతీరోజు యోగా చేస్తే అద్భుత ఫలితాలు కనిపిస్తాయి. క్లబ్‌కు వచ్చే నూతన సభ్యులకు ప్రత్యేక తరగతులను అందిస్తున్నాం. ఉచితంగా అందించే యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి.

- కంచర్ల వెంకటేశ్వర్లు, యోగా గురువు, మిర్యాలగూడ

నేడు రాష్ట్రస్థాయి పోటీలు

సూర్యాపేట జిల్లా నకిరేకల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నారు. ఆనందో బ్రహ్మ యోగా మండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి సభ్యులు హాజరుకానున్నారు. వక్రాసనం, సర్వాంగాసనం, వృక్షాసనం, త్రికోనాసనం, గోముఖాసనం, భుజంగాసనం, చక్రాసనం, నౌకాసనం, ఉష్ట్రాసనం, సూర్యనమస్కారాలు, విన్యాస యోగా తదితర విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఊరూరా తిరిగి ప్రచారం నిర్వహించారు. యోగాపై అవగాహన పెంచడమే పోటీల ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

అన్ని ప్రాంతాలకు విస్తరిస్తాం



ఆరోగ్య సాధనమైన యోగాను జిల్లాలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నాం. పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే పది శిబిరాలు ఉండగా, అందులో 6యాక్టివ్‌గా ఉన్నాయి. అన్ని క్లబ్‌లను ప్రోత్సహించడంతో పాటు నూతన శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆయా క్లబ్‌లలో యోగాభ్యాసంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- కోల సైదులు, యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

మహిళలకు ఎంతో అవసరం



ప్రస్తుత పరిస్థితుల్లో పురుషులతో సమానంగా మహిళలు బాధ్యతలు మోస్తున్నారు. ఈ తరుణంలో మహిళలు కూసింత ఒత్తిడికి గురవుతున్నారు. ఆ ఒత్తిడిని జయించేందుకు ఏకైక, సులువైన మార్గం యోగానే. అందుకే సంపూర్ణారోగ్యాన్నిచ్చే యోగా సాధన మహిళలకు అవసరం. పట్టణంలోని పలు చోట్ల ఉచితంగా నిర్వహించే యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి. గంట సేపు ఆసనాలు వేస్తే 23 గంటలు ఉత్సాహంగా ఉండగలుగుతాం.

- గుడిపాటి అనిత, యోగా గురువు, మిర్యాలగూడ

పల్లె ఆణిముత్యాలకు ప్రోత్సాహమేదీ?

● పట్టుదలతో ముందుకు వస్తున్న క్రీడాకారులు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

భువనగిరి టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అత్యంత ఆదరణ ఉన్న క్రీడల్లో క్రికెట్ మొదటి స్థానం కాగా రెండో స్థానం వాలీబాల్‌ది. వాలీబాల్‌ను క్రీడాకారులు, అభిమానులు నిరంతరం ఆదరిస్తున్నారు. ఈ క్రీడలో ఎంతోమంది రాణిస్తున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, సిద్దిపేటలో ప్రభుత్వం టెన్నిస్ అకాడమీలను ఏర్పాటు చేసింది. కానీ రెండింటిలో మాత్రమే కోచ్‌లు ఉండగా మిగతా రెండు నెలల తరబడి ఖాళీగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం క్రీడాకారులకు డైట్ కూడా ఇవ్వలేని దుస్థితి. కానీ ప్రభుత్వాలు మాత్రం లక్షల కోట్ల వ్యయంతో ఒలంపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించేందుకు ఉత్సాహం చూపుతుండటం గమనార్హం. మెజార్టీ పాఠశాలల్లో పీఈటీ పోస్టులు ఖాళీగా ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో కేవలం 10లోపు పీడీ పోస్టులు మాత్రమే భర్తీగా ఉండటం, ఆ పదింటి జాబితాలో యాదాద్రి జిల్లాలోని రెండు కళాశాలలు ఉండగా సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని అన్ని పీడీ పోస్టులు ఖాళీగా ఉండటం క్రీడల పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్షను తెలియచేస్తోందని క్రీడాకారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో భువనగిరిలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్ -19 బాలుర రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీలో ఇంటర్ విద్యార్థులు చూపుతున్న ప్రతిభ అందరినీ అబ్బురపరుస్తోంది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'తో క్రీడాకారులు పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లో..

ఆసక్తితో ఆడుతున్న



ఆసక్తితో 8వ తరగతి నుంచి వాలీబాల్ ఆడుతున్నాను. ఇప్పటి వరకు ఒక స్టేట్‌ని, 3 జిల్లా పోటీల్లు ఆడాను. ఆశించినంత ప్రోత్సాహం లభిస్తే మరింత రాణించగలను. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులను మెరుగు పరిస్తే పలువురు క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

-బూడిద రాఘవ, త్రిపురారం మోడల్ స్కూల్, నల్లగొండ

వాలీబాల్ అంటే ప్రాణం



వాలీబాల్ అంటే నాకు ప్రాణంతో సమానం. అంతగా అభిమానించే ఈ క్రీడలో రాణించేందుకు మైదానంలో నిరంతరం శ్రమిస్తున్నాను. ఇప్పటి వరకు ఒక స్టేట్, రెండు జోనల్, 3 జిల్లా మీట్‌లలో ఆడి ప్రతిభ చూపాను. ప్రస్తుతం హైదరాబాద్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాను.

-కె.మహేష్, రంగాపూర్, యాదాద్రి భువనగిరి జిల్లా

పీఈటీ ప్రోత్సాహంతో వచ్చా



మా స్వగ్రామం చివ్వెంల. మా పక్క గ్రామమైన టేకుమట్ల క్రీడాకారులు వాలీబాల్‌లో ప్రతిభ చూపేవారు. ఈ నేపథ్యంలో టేకుమట్ల జట్టును ఓడించే లక్ష్యంతో మా గ్రామానికి చెందిన పీఈటీ కుంభం శ్రీనివాస్ తీర్చి దిద్దిన జట్టులో నేను ఒకడిని. అదే స్ఫూర్తితో నేటికి వాలీబాల్ ఆడుతున్నాను. భవిష్యత్తులో మరింత రాణించడం నా లక్ష్యం.

-ఎస్.విజయ్, చివ్వెంల, సూర్యాపేట జిల్లా

జాతీయ జట్టులో స్థానమే లక్ష్యం



జాతీయ జట్టులో స్థానం సంపాదించడం నా లక్ష్యం. ఇందు కోసం పాఠశాల విద్య నుంచే వాలీబాల్ ఆడుతున్నాను. పలు టోర్నీల్లో పాల్గొన్నాను. అయితే ఆర్థికంగా, వసతుల పరంగా ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం. కానీ ఇప్పటి వరకు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల సహకారంతోనే ఆడుతున్నాను.

-కె.అక్షిత్‌రెడ్డి, కరీంనగర్

క్రీడలను ప్రోత్సహించాలి



ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు క్రీడలను ప్రోత్సాహించాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు పెద్ద మొత్తంలో బహుమతులు ఇవ్వడం సబబే. అయినప్పటికీ అదే ప్రోత్సాహాన్ని కింది స్థాయి నుంచి ఇవ్వగలిగితే పెద్ద సంఖ్యలో ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. ఈ దిశగా అందరూ ఆలోచన చేస్తే బాగుంటుంది.

-కె.లోకేష్, నర్సంపేట, ఉమ్మడి వరంగల్ జిల్లా

అన్నయ్య స్ఫూర్తితో



మా అన్నయ్య శ్రీరాం స్ఫూర్తితో నేను వాలీబాల్ ఆడుతున్నాను. అతను పలు రాష్ట్ర, జాతీయ టోర్నీల్లో పాల్గొన్నాడు. రాష్ట్ర అండర్ 19 కెప్టెన్‌గా కూడా వ్యవహరించాడు. ప్రస్తుతం కేరళ, క్యాలీకట్ యూనివర్సిటీలో చదువుకుంటూ అదే యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. దేశం తరపున ఆడటం మా ఇద్దరి లక్ష్యం.

-సీహెచ్.సృజనకుమార్, గజ్వేల్, ఉమ్మడి మెదక్ జిల్లా

ప్రతిభ కలిగిన క్రీడాకారులు చాలా మంది ఉన్నారు



రాష్ట్రంలో ప్రతిభ కలిగిన వాలీబాల్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారందరూ సొంత ప్రతిభతోనే రాణిస్తున్నారు. ప్రతిభ చూపే క్రీడాకారులను గుర్తించి శిక్షణ, ప్రోత్సాహం ఇవ్వగలిగితే తెలంగాణ నుంచి దేశానికి మెరుగైన క్రీడాకారులను అందించే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వంతో పాటు క్రీడాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు శ్రద్ధ చూపాలి.

-నర్ర శ్రీనివాస్‌రెడ్డి, టోర్నీ రాష్ట్ర పరిశీలకుడు

దాతల సహకారంతోనే నెట్టుకొస్తున్నాం



టోర్నమెంట్ల నిర్వహణతోనే మెరుగైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. కాని టోర్నీమెంట్ల నిర్వహణ ఆర్థిక ఇబ్బందులతో ముడిపడుతున్నది. దాతల సహకారంతోనే నెట్టుకొస్తున్న పరిస్థితి. ఈ పోటీల్లోనే రాష్ట్ర అండర్ 19 బాలుర వాలీబాల్ జట్టును ఎంపిక చేయనున్నాం. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేసిన జట్టు రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనుంది.

-డాక్టర్ కె.ప్రసాద్, కార్యదర్శి, అండర్ 19 వాలీబాల్ పోటీలు

లోక్‌సభ స్పీకర్‌ను ఎంపీ రఘువీర్‌రెడ్డి



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసిన ఎంపీ రఘువీర్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రస్థాయిలో పలు ముఖ్య అంశాలపై నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో చర్చించారు. మౌలిక సదుపాయాలు, విద్య, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలు వంటి రంగాల్లో మరింత వేగంగా పురోగతి సాధించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మల్లన్న, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి గంజ్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19బాలుర రాష్ట్ర లెవల్ వాలీబాల్ పోటీలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ క్రీడలు శరీర మానసికోల్లాసానికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. విద్యార్థులు అందరూ ఇలాంటి పోటీల్లో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని, క్రీడారంగంలో విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని, జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకరావాలని సూచించారు. అంతకముందు జ్యోతి ప్రజ్వలన చేసి స్వాగతం గీతం ఆలపించారు. ఈ క్రీడా పోటీల్లో ఉమ్మడి 10జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, పీడీలు, పీఈటీలు, సీఎస్ఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, టోర్నీ కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాద్, అధికారులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరణించినా మరికొందరికి జీవితాన్నిస్తూ..

● మునుగోడు చెందిన యువతికి బ్రెయిన్‌డెడ్

● అవయవదానం చేసిన కుటుంబసభ్యులు



రమ్యశ్రీ (ఫైల్)

నల్లగొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మునుగోడు మండలానికి చెందిన ఓ యువతి బ్రెయిన్‌డెడ్ కాగా, కుటుంబ సభ్యులు అతడి అవయవాలు దానంచేసి ఆదర్శంగా నిలిచారు. భౌతికంగా లేకున్నా మరొకరి రూపంలో బతికే ఉంటాడని జీవన్‌దాన్ ట్రస్ట్ నిర్వాహకుల సూచనల మేరకు ఆమె కుటుంబ సభ్యులు ఇందుకు అంగీకరించారు. మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన చెనగోని గిరిప్రసాద్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె బండిగారి రమ్యశ్రీ (28)ని రంగారెడ్డి జిల్లా బాటసింగారానికి చెందిన వ్యక్తికి వివాహం చేశారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న ఆమె ఈ నెల 20వ తేదీన ఇంట్లో అకస్మాత్తుగా కిందపడిపోయింది. దీంతో వెంటనే ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయ్యిందని వైద్యులు నిర్ధారించారు. నాలుగు రోజులపాటు వెంటిలేటర్‌పై ఉంచిన కుటుంబసభ్యులు, భర్త వైద్యుల సూచన మేరకు శుక్రవారం తమ కుమార్తె అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. బంధువులు, స్నేహితుల అశ్రునయనాల మధ్య రమ్యశ్రీ అంత్యక్రియలు శనివారం బాటసింగారంలో నిర్వహించారు.

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సౌకర్యాలు కల్పించాలి

● ఉమ్మడి నల్లగొండ రిజిస్ట్రార్ ఎం.రవీందర్‌రావు




సూర్యాపేట సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వేలిముద్రల రికార్డును పరిశీలిస్తున్న ఎం.రవీందర్‌రావు

భానుపురి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలని ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల రిజిస్ట్రార్ ఎం.రవీందర్‌రావు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వినియోగదారులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని కంప్యూటర్, రికార్డు గదులను పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విశాలంగా లేదని, మరొకటి చూడాలని సబ్‌రిజిస్ట్రార్ రవీందర్‌రెడ్డికి సూచించారు. కంప్యూటర్‌లో వివిధ డ్యాకుమెంట్ల వివరాలను పరిశీలించారు. ఫొటోలు సక్రమంగా తీయాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా కార్యాలయానికి వచ్చిన వారు పలు సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బిల్డర్ నల్లగుంట్ల సందీప్‌నాయుడు మాట్లాడుతూ ఈసైన్ ఆలస్యం అవుతోందని, వేలిముద్రలు తీసుకునే చోట ఒకరు రాకపోతే చాలాసేపు మిగతా వారిని ఆపుతున్నారని సూచించారు. కార్యాలయానికి వచ్చే వారిని త్వరగా పంపించేలా చూడాలని పలువురు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని సబ్‌రిజిస్ట్రార్ రవీందరెడ్డి ప్రశ్నించగా 45 అవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్లాట్ బుక్ చేసుకున్న వారు రాకపోవడం వల్ల రిజిస్ట్రేషన్లు ఎక్కువ కావడం లేదని, 2 గంటలకే ఎక్కువ మంది వస్తున్నారని జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లారు. వారి వెంట కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సాగర్ కుడికాల్వకు నీటి విడుదల నిలిపివేత

● ఎడమకాల్వకు నీటి విడుదల తగ్గింపు ● 587.20 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం



నీటి విడుదల నిలిపివేసిన కుడి కాల్వ

నాగార్జునసాగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కుడి కాల్వ నీటి విడుదలను శనివారం నిలిపివేయగా, ఎడమ కాల్వకు నీటి విడుదలను తగ్గించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కుడి, ఎడమకాల్వల ఆయకట్టులో రైతులకు నీటి అవసరాలు తక్కువగా ఉన్నాయి. అంతేకాక కొన్ని చోట్ల వరి చేలు పొట్టదశలో ఉండటం మరికొన్ని చోట్ల కోతలు మొదలవడంతో కుడికాల్వకు శనివారం సాయంత్రం ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. అలాగే ఎడమ కాల్వకు నీటి విడుదలను తగ్గించారు. ఈ నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు) కుడి, ఎడమకాల్వకు జూలై 29వ తేదీ నుంచి సాగు, తాగు నీటి అవసరాలకు ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. ఈ మూడు నెలల కాలంలో కుడికాల్వకు 68 టీఎంసీల నీటిని, ఎడమకాల్వకు 52 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 587.20 అడుగులు (305.6242టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి ఎడమకాల్వ ద్వారా 2878 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 34,210 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 34,210 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది.

యూకేలో వైభవంగా యాదగిరీశుడి కల్యాణం



గ్లోస్టర్ నగరంలో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కల్యాణంలో గ్లోస్టర్ నగరంలో వైభవంగా నిర్వహించారు. యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు అసోసియేషన్ (యూకేటీఏ) ఆధ్వర్యంలో కన్వెన్షన్ హాల్‌లో నిత్య కైంకర్యాల్లో భాగంగా సుప్రభాత సేవ, ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామివారి ఆవిర్భావ ఘట్టం నృత్య రూపంలో ప్రదర్శన భక్తులు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, అసోసియేషన్ చైర్మన్ సత్యప్రసాద్, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. కాగా, కార్తీక మాసం పురస్కరించుకుని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ విష్ణు పురాణం దివ్య ప్రవచనం చేశారు. కాగా శనివారం యాదగిరిగుట్టలో నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.24,75,217 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో జి.రవి తెలిపారు. కాగా, కార్తీక మాసంలో కొండకింద వ్రత మండపాల్లో సత్యదేవుని వ్రతాల్లో435 జంటలు పాల్గొన్నాయి. మొదటి విడత 73, రెండో విడత 94, మూడో విడత 128, నాలుగో విడత 83, ఐదో విడత 33, ఆరో విడత 24 వ్రతాలు నిర్వహించారు.

రైతుబజార్ ఏర్పాటు కోసం భూసర్వే



చిట్యాలలో భూసర్వే చేస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

చిట్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు అమ్మడం కోసం నిర్మించ తలపెట్టిన రైతుబజార్ కోసం చిట్యాలలోని 471 సర్వే నెంబర్‌లో ఆర్డీవో అశోక్‌రెడ్డి శనివారం భూసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో మొదటిసారిగా ఆర్గానిక్ ఉత్పత్తుల విక్రయానికి రైతుబజార్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆర్గానిక్ పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ జానీపాష, సిబ్బంది పాల్గొన్నారు.

27న మాదారంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

శాలిగౌరారం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మాదారం గ్రామ సమీపంలోని టీటీఆర్ కాటన్ మిల్‌లో ఈ నెల 27వ తేదీన సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభిస్తారని శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి చీనా నాయక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పత్తి రైతులు నాణ్యమైన పత్తిని కాటన్ మిల్లుకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

చిట్యాలరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల వయసున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో వెంకటమ్మ అన్నారు. చిట్యాల మండలంలోని ఏపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తారని అన్నారు. చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, హంసమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తడిసి రంగుమారి...

● వరుస వర్షాలతో చెట్టుపైనే తడిసి ముద్దవుతున్న పత్తి ● ఆందోళనలో పత్తి రైతులు



వరస వర్షాలతో చెట్టు పైన తడుస్తున్న పత్తి

మర్రిగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు శ్రమించి పండించిన పత్తి పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వరుస వర్షాలతో చెట్టు పైన ఉన్న పత్తి తడిసి ముద్దవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మర్రిగూడ మండలంలో 32 వేల ఎకరాల వరకు రైతులు పత్తి సాగు చేసుకున్నారు. పత్తిని నమ్ముకున్న రైతులకు అటు తీవ్ర ఎండలు వల్ల ఎర్ర గుమ్మడి తెగులు సోకి, ఇటు వరుస వర్షాలు కురుస్తున్నందున రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండలు, వర్షాలు తరచూ పడటం వల్ల ఎర్ర గుమ్మడి ఆకు తెగులు సోకి ఇప్పటికే 25వేల ఎకరాల్లో పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. చేతికి వచ్చే సమయంలోనే వర్షాలు కురవడం వల్ల చెట్టుపైనే ఉన్న పత్తి తడిసి ముద్దయి నేలరాలుతుండటంతో పత్తి చేను ఏరటానికి కూలీలు సైతం దొరకక, ఒకవేళ కూలీలు దొరికినప్పటికీ అధిక కూలి అడుగుతూ డిమాండ్ చేస్తున్నారని రైతులు బెంబేలెత్తుతున్నారు. అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల అప్పులు ఇచ్చిన వారు మాకు డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో మాకు డబ్బులు ఇవ్వాలని దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు తెచ్చిన అప్పులు తీర్చుకోవాలని దళారుల వైపు మొగ్గు చూపుతున్నామని ఆవేదన వెల్లడిస్తున్నారు. పత్తి కొనుగోలు దళారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఇదే అదునుగా పత్తి తడిసి నల్లగా మారిందని, రైతులకు సాకులు చెబుతూ పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు.

ఏమి చేయలేని పరిస్థితి

పత్తి సాగుకు పెట్టుబడులు పెట్టి చేతికి వచ్చే సమయంలో పత్తి పంట వరుస వర్షాలకు తీవ్రంగా దెబ్బతినడం వల్ల పెట్టుబడులు వెళ్లక అప్పుల పాలవుతున్నాం. దీంతో కోలుకోలేని స్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ అధికారులు స్వయంగా రైతులు వేసినటువంటి పత్తి సాగు వద్దకు వెళ్లి ఎర్ర గుమ్మడి సోకిన పత్తి సాగును ఎండిన పంటను పరిశీలించారు. మండలంలో పత్తి పంటపై ఎన్ని వేల ఎకరాల వరకు ఎంత పత్తి నష్టం జరిగిందని సూచనప్రాయంగా అంచనా వేశారు. అదేవిధంగా మండలంలో వరి సాగు కూడా వరుస వర్షాల వల్ల వరి ధాన్యం నేలకొరిగిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రైతులము దళారుల చేతుల మోసపోకుండా, అధికారులు స్పందించి వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పది ఎకరాలు పత్తి సాగు చేశాను



పత్తి చేను ఎదిగే సమయానికి ఎర్రగుమ్మడి తెగులు సోకి పంట దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయాం. దీనికి తోడు వరుస వర్షాలు పడటం వల్ల పత్తి చేనుకున్న కొద్దో గొప్పో ఉన్న పత్తి చేతికి వచ్చే సమయంలో వర్షాలకు తడిసి ముద్దయి కింద రాలిపోతుంది. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టాం. పెట్టుబడులు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి నష్టపోయిన పంటను పరిశీలించి రైతులను ఆదుకోవాలి.

- పాలకూర, కృష్ణయ్య, కొండూరు

రత్నపురస్కార్‌కు టీజీ లింగంగౌడ్ ఎంపిక

నార్కట్‌పల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ ప్రతీ సంవత్సర అందజేసే రత్న పురస్కార్ అవార్డుకు నార్కట్‌పల్లికి చెందిన నేస్తం స్వచ్ఛంద సంస్థ (ఎన్ఎస్ఎస్‌వో) వ్యవస్థాపక అధ్యక్షుడు టీజీ లింగంగౌడ్ ఎంపికయ్యారు. ఈ నెల 28వ తేదీన త్యాగరాయ గానసభలో జరిగే వేడుకలో అవార్డును అందించనున్నారు.

ఆస్పత్రి పనులను వెంటనే పూర్తిచేయాలి



నకిరేకల్‌లో వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌లో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను త్వరలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ ఆస్పత్రి ప్రారంభమైతే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. ఆసుపత్రికి సంబంధించిన పెండింగ్ బిల్లులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించానన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మునిసిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, నాయకులు గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మండలి చైర్మన్ గుత్తాను కలిసిన ఎమ్మెల్సీ సత్యం



మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ సత్యం

నల్లగొండ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మర్యాదపూర్వకంగా కలిశారు. నార్త్ అమెరికా ఖండంలోని బార్బడోస్ దేశంలో జరిగిన 68వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) కాన్ఫరెన్స్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో పర్యటించారు. అనంతరం నల్లగొండకు వచ్చిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శనివారం గుత్తా క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బొల్గూరి నర్సింహ, తీర్పాటి వెంకటేశ్వర్లు, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య ఉన్నారు.

ఎన్జీ కళాశాల స్టాఫ్ క్లబ్ కార్యదర్శిగా సుధాకర్

నల్లగొండటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగార్జున ప్రభుత్వ కళాశాల స్టాఫ్ క్లబ్ కార్యదర్శిగా సీహెచ్. సుధాకర్ ఎన్నికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీ కళాశాలలో శనివారం నిర్వహించిన అధ్యాపకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టాఫ్ క్లబ్ కార్యదర్శిగా సధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ఎన్జీ కళాశాల స్టాఫ్‌కు ఎదురయ్యే అన్ని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంలో అధ్యక్షుడిగా డాక్టర్ పరంగి రవికుమార్, కార్యదర్శి చిలుముల సుధాకర్, సభ్యులు డాక్టర్ ఆదె మల్లేశం, వెంకట్‌రెడ్డి, వాసుదేవు, గోవర్ధనగిరి, శివరాణి, వెంకటేశం ఉన్నారు. నూతన కార్యవర్గాన్ని ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందిచారు.

మార్కెట్ మడిగెలకు వేలం



మడిగె దక్కించుకున్న వారికి పత్రాలు అందజేస్తున్న వినోద

చిట్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో భువనగిరి రోడ్డులో నిర్మించిన 30 మడిగెలకు శనివారం వేలం నిర్వహించారు. మడిగెలకు వేలంలో భారీ స్థాయిలో ధర లభించింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న మడిగెలలో అత్యధికంగా ఒక మడిగెకు రూ.17,600 కాగా కనిష్ఠంగా రూ.8,400 పలికింది. మొత్తం 30 మడిగెలకు గాను రూ.2.70లక్షల అద్దె వచ్చినట్లు కార్యదర్శి జానయ్య తెలిపారు. వేలంపాట కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ అయితరాజు యాదయ్య, మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్, డీఎంవో ఛాయాదేవి, చిట్యాల మార్కెట్ కార్యదర్శి జానయ్య, శ్రీనాధ రాజు, ప్రవీణ్, మార్కెట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

శివానందక్షేత్రంలో వార్షిక ఉత్సవాలు

నార్కట్‌పల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రానికి శివారులో వివేరా హోటల్ సమీపంలో ఉన్న పురాతన శివానంద క్షేత్రంలో శనివారం ఆలయ వార్షిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పురోహితుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ యాజ్ఞీకంలో, బ్రాహ్మణుల వేదమంత్రాల నడుమ ఈ ఉత్సవ వేడుకల్లో నవగ్రహ పూజలు, క్షేత్రంలోని పురాతన శివలింగానికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు, యజ్ఞక్రతువులను అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకలో ఆలయ పునర్నిర్మాణదాతలు తెలంగాణా రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, రఘు దంపతులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో షాడో ఆఫీసర్

(5వ పేజీ తరువాయి)

చిన్న సార్ చెప్పిన విధంగానే ఫైల్‌ను కదిలించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఆ సొసైటీ సభ్యులు తిరిగి కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. సొసైటీకి సంబంధించిన ఓ వర్గం సభ్యులు ఆ ఫైల్‌ను నిలిపివేయాలని రాతపూర్వకంగా జిల్లా డీఆర్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేశారు. అయినా తనకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని పేర్కొంటూ ఫైల్‌ను కదలించడం విమర్శలకు తావిచ్చింది. ఈ విషయంలో జిల్లా కార్యాలయంలోని సదర్ సెక్షన్ ఉద్యోగే అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి రిజిస్ట్రేషన్ అధికారులు సెక్షన్-23 ప్రకారం జనరల్ బాడీ తీర్మానాలను పరిశీలించి, వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, ఇక్కడ అందుకు విరుద్ధంగా వ్యవహరించారు.

డీఆర్ కార్యాలయంలో ఆయనే షాడో ఆఫీసర్

జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆయనే షాడో ఆఫీసర్‌గా వ్యవహరిస్తుండటంతో ఇతర ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. సెక్షన్ల సర్దుబాటు విషయంలో అధికారుల తప్పిదాలు బయట పడుతున్నాయి. సీనియర్ ఉద్యోగులకు ఎలాంటి ప్రాధాన్యం లేని సెక్షన్లు అప్పగిస్తూ అవగాహన లేని వారైనా సరే అనుకూలంగా ఉన్న వారికి కీలకమైన సెక్షన్లు కట్టబెడుతున్నారు. దీంతో డీఆర్ కార్యాలయంలో కొంతకాలంగా గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇతర ఉద్యోగుల పనుల్లో జోక్యం చేసుకుంటుండటంతో సెక్షన్లలో పనులన్నీ మందకొడిగా సాగుతున్నాయి. పక్క సెక్షన్లలో ఫైళ్లను కూడా తానే పరిశీలిస్తాననేలా సదరు సార్ వ్యవహరించడం వివాదాస్పదంగా మారుతోంది. ఉన్నతాధికారులు సైతం వారు కేవలం ఇన్‌చార్జీలు అనే భావనతో సెక్షన్లలోని గందరగోళాన్ని, ఉద్యోగుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. దీంతో తోటి ఉద్యోగులపై ఆ చిన్న సార్ పెత్తనం పెరిగింది. దీన్ని నివారించకపోవడంతో కార్యాలయంలోని ఇతర ఉద్యోగులు ఇబ్బందులుపడుతున్నారు. అదేవిధంగా ఆ చిన్న సార్ ఉమ్మడి జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఫోన్ చేసి పెత్తనం చేస్తున్నట్టు తెలిసింది. జిల్లా కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానంటూ వారిపై కూడా అజమాయిషీ చేసేలా వ్యవహరిస్తుండటంతో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ పాలన గాడి తప్పుతోంది.

అక్రమాలు, అవకతవకలకు అవకాశం ఉండదు

ఒక సెక్షన్ ఉద్యోగి ఇతర సెక్షన్లలో జోక్యం చేసుకునే అవకాశం ఉండదు. అక్రమాలకు, అవకతవకలకు తావు ఉండదు. తాను ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో అలాంటి వాటికి అవకాశం ఉండే ప్రసక్తే లేదు. ఏమైనా ఫిర్యాదులు వస్తే పరిశీలన చేస్తాం. సెక్షన్లకు సంబంధించి కూడా ఎప్పటికప్పుడూ సమీక్ష ఉంటుంది. అంతే తప్ప ఒక ఉద్యోగి ఇతర ఉద్యోగులను ఇబ్బందులను గురి చేయడం అనేది ఉండదు. సొసైటీలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదులు చేస్తే పరిష్కరిస్తాం.

- ఎం.రవీందర్‌రావు, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తా



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేంత వరకు విశ్రమించబోనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం చండూరు మునిసిపాలిటీలో రూ.2.90 కోట్ల నిధులతో చేపడుతున్న శనగకుంట చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ సత్యంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతానని ఎన్నికల్లో హామీ ఇచ్చానని, ఆ దిశగా అమలుకు శ్రీకారం చుట్టానని అన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో సంక్షేమం కుంటు పడిందన్నారు.

శరవేగంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఇప్పటికే రూ.కోట్లు నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, చండూరు సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వెంకన్న, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో యాదగిరి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్, నాయకులు అనంత చంద్రశేఖర్‌గౌడ్, నల్లగంటి మల్లేశం, కోడి శ్రీనివాసులు, కలిమికొండ జనార్ధన్, మంజుకొండ సంజయ్, కల్లెట్ల మారయ్య, కారంగు రామ్మూర్తి, భూతరాజు, గండూరి జనార్ధన్, భూతరాజు ధశరథ పాల్గొన్నారు.

మర్రిగూడ: బస్ సౌకర్యం కల్పించాలంటూ రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తానేదారిపల్లి గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. శనివారం సరంపేట నుంచి చండూరుకు వెళుతున్న సందర్భంగా సరంపేట క్రాస్ రోడ్ వద్ద ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని తానేదార్‌పల్లి గ్రామస్థులు కలిశారు.

గోసంరక్షకులపై దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు

రామగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ రాంపల్లి వద్ద గో సంరక్షకుడు సోనూసింగ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘాల ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ సోనుసింగ్‌పై తుపాకీతో కాల్పులు చేసిన సంఘటన ఆటవిక రాజ్యాన్ని తలపించేలా ఉందన్నారు. గోహత్య చట్టాన్ని అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ముష్కరులకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. అంతేకాకుండా సోనుసింగ్‌పై తప్పుడు కేసులు నమోదు చేసి కేసును పక్కదోవ పట్టేలా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి దుండగులకు కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రౌడీ షీటర్ల వద్ద అక్రమంగా కలిగి ఉన్న ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నగర అధ్యక్షుడు రాయల కృష్ణయ్య, జిల్లా సహాయ కార్యదర్శి జూకూరి సంపత్‌వర్మ, జిల్లా సేవా ప్రముఖ్ గోవర్ధన్, సంతోష్, నర్సింహ, శ్రీనునాయక్, ప్రకాశ్, శ్రీవాత్సవ్, శంకర్, హరి, సాత్విక్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.30వేల పరిహారం ఇవ్వాలి

కేతేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యం కారణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోయిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో శనివారం తడిసిన ధాన్యం రాశులను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా చినవెంకులు మాట్లాడుతూ ధాన్యం తడిసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం ఆరబెట్టడానికి అవసరమైన డ్రయ్యర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్న రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి లూర్దుమారయ్య, నా యకులు కోట లింగయ్య, ఎల్.రాజు, గాదె సత్తిరెడ్డి, ఎల్లయ్య, వెంకన్న, సౌడయ్య, లిం గయ్య తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కట్టంగూరు: ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఆ సంఘం నాయకులు పరిశీలించారు. అనంతరం తడిసిన ధాన్యాన్ని కొనుగో లు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రవి, సత్తిరెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

నకిరేకల్: ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘం మహిళా కన్వీనర్ కందాళ ప్రమీల డిమాండ్ చేశారు. సీపీఎం రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్‌లోని చీమలగడ్డ, నెల్లిబండ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 15 రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకువచ్చినా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అకాలవర్షాల కారణంగా ధాన్యం తడిసి అడుగుభాగంలో మొలకలు వస్తున్నాయని, మ్యాచర్ పేరుతో అధికారులు రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, సాకుంట్ల నర్సింహ, వంటెపాక కృష్ణ, గింజల లక్ష్మి, స్వరూప, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

రామగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ హెచ్చరించారు. శ్మశానవాటికలో పనిచేస్తున్న సిబ్బంది ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో శనివారం ఆయన సంబంధిత సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో ఏ మాత్రం అలసత్వం వహించినా, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతాయన్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గడ్డం శ్రీనివాస్, నంద్యాల ప్రదీప్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



పానగల్ రోడ్డులోని ఎల్లమ్మ ఆలయంలో భక్తుల పూజలు



కనగల్: దర్వేశిపురం ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల ప్రాంగణంలోని పుట్టలకు మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామునుంచే మహిళా భక్తులు సమీపంలోని దేవాలయాలకు వెళ్లారు. అక్కడి పుట్టలను పసుపు, కుంకుమలతో అలంకరించి కొబ్బరికాయలను సమర్పించి, పాలు పోసి, పండ్లు, నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్తీకమాసం శుద్ధ చతుర్థి రోజున భక్తులు నాగుపాము పుట్టలను పూజిస్తే మంచి జరుగుతుందని నమ్ముతారు. పట్టణంలోని వీటీ కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, తులసీనగర్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం, షేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, పానగల్లు రోడ్డులోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం, పానగల్లులోని పచ్చలసోమేశ్వరాలయం, ఛాయాసోమేశ్వరస్వామి ఆలయం, అన్నెపర్తి బెటాలియన్‌లో, మర్రిగూడ స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం తదితర ఆలయ ప్రాంగణంలోని పుట్టలకు దర్శించుకొని భక్తితో ఆ పుట్టలో పాలు పోసి నాగదేవతలను పూజించారు. దీంతో పుట్ట వద్ద మహిళా భక్తుల సందడి నెలకొంది.

ఎల్లమ్మ ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు....

కనగల్: కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శనివారం నాగుల చవితి ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద గల పుట్టలో పాలుపోసి, నాగపడిగలకు పసుపు కుంకుమలను చల్లి మొక్కుకున్నారు. కోరికలు నెరవేరాలని కోరుతూ వేపకొమ్మలకు ముడుపులు కట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ మాజీ చైర్మన్ దేప కరుణాకర్‌రెడ్డి జింబాబ్వే పర్యటనను ము గించుకుని నేరుగా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అర్చకులు వేద ఆశీర్వచనాలను తీర్థ ప్రసాదాలను అందజేశారు.




పానగల్ రోడ్డులోని ఎల్లమ్మ ఆలయంలో విగ్రహానికి పూజలు చేస్తున్న మహిళలు

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	34,204	34,204
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	5,015.38	5,015.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

రిజిస్ట్రేషన్ల శాఖలో షాడో ఆఫీసర్



- ఇతర సెక్షన్లపై అజమాయిషీ చేస్తున్న ఓ చిన్న సార్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న తోటి ఉద్యోగులు
- అస్తవ్యస్తంగా మారిన సెక్షన్లు
- జూనియర్లకే కీలక బాధ్యతలు అప్పగించడంతో సమస్యలు

జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యాలయంలో ఓ ఉద్యోగి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తోటి ఉద్యోగులపై పెత్తనం చేస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అతడికి సంబంధం లేని సెక్షన్లపైనా అజమాయిషీ చెలాయిస్తూ ఇతర ఉద్యోగుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎవరి సెక్షన్లకు వారే బాధ్యత వహించాలి. కానీ, ఎటువంటి సంబంధం లేకున్నా ఆ చిన్న సార్ వ్యవహరిస్తున్న తీరు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చెడ్డపేరు తీసుకొస్తోంది.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

రిజిస్ట్రేషన్లశాఖ ఉన్నతాధికారి పోస్టును ఇన్‌చార్జీలకు అప్పగించడం లేదా, పూర్తిస్థాయిలో వచ్చిన అధికారి తరచూ సెలవుల్లోకి వెళ్లడం, అది కాదంటే ఉన్నతాధికారులు బదిలీ అయిన సమయంలో తిరిగి ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగిస్తుండటంతో రిజిస్ట్రేషన్లశాఖ జిల్లా కార్యాలయంలో పాలన గాడి తప్పుతోంది. ఇన్‌చార్జీగా ఉన్న అధికారి ఏదో ఒక రోజు వచ్చి పోతుండటంతో ఇక్కడ ఉన్న ఆ చిన్న ఉద్యోగి ఆడిందే ఆటగా మారిందనే చర్చ శాఖలో ఉంది. ప్రభుత్వం అప్పగించిన పనిని సెక్షన్ల వారీగా నిర్వహించాల్సి ఉండగా, అన్నీ తానై చక్కబెట్టేందుకు ఇతరుల విధుల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజుల క్రితం ఉమ్మడి జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన ఆ ఉద్యోగి తన పలుకుబడితో నిబంధనలకు విరుద్ధంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి తిరిగి విధులో చేరడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడైనా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌లు లేకపోతే ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్‌ను నియమించాల్సి ఉండగా, జూనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జిగా నియమిస్తుండటంతో అవకతవకలు చోటు చేసుకోవడం ఆడపాదడపా సస్పెండ్ అవుతుండటం పరిపాటిగా మారింది. అయినా జూనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌లుగా నియమిస్తూ వివాదాలకు కారణమవుతున్నారు.

కోర్టులో కేసు ఉన్నా ఫైళ్లలో కదలిక

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి కోర్టుల్లో కేసులు ఉన్నా ఫైల్‌ను కదిలిస్తున్నట్లు తెలిసింది. సదరు ఉద్యోగి చేయితడిపితే చాలు ఎంతటి ఫైల్ అయినా తారుమారు చేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన సొసైటీల ఫైళ్లను ఇదేవిధంగా తారుమారు చేసి సొసైటీ సభ్యుల మధ్య విభేదాలకు దారితీసేలా చేయడం రచ్చకు దారితీసింది. కోర్టుల్లో కేసులు ఉన్న సమయంలో ఆ ఫైల్‌ను పక్కన పెట్టాలి. కానీ డబ్బు చేతులు మారడంతో వాటిని క్లియర్ చేసేలా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఇతర జిల్లాకు చెందిన ఓ అధికారిని నల్లగొండ జిల్లా రిజిస్ట్రేషన్ జిల్లా కార్యాలయ అధికారిగా నియమించిన సమయంలో సొసైటీల ఫైల్‌లను క్లియర్ చేసినట్లు అప్పట్లో ఆరోపణలు గుప్పుమన్నాయి. వాస్తవానికి సొసైటీలకు సంబంధించి ఆయా సభ్యుల మధ్య విభేదాలు వచ్చి కార్యాలయంలో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నప్పుడు ఉన్నతాధికారి విచారణ నిర్వహించి ఎవరివైపు న్యాయం ఉంటే వారికి అనుకూలంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ, ఈ సొసైటీ విషయంలో

మిగతా 8వ పేజీలో...

గ్రామీణ యువతకు ఉపాధి

- ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి కృషి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి





ఉద్యోగమేళాకు హాజరైన నిరుద్యోగులు, కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులకు ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించినట్లు నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో తెలంగాణ పరిశ్రమలు, డీట్, సింగరేణి కాలరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా జాబ్‌మేళాను మంత్రి ఉత్తమ్ ప్రారంభించి మాట్లాడారు. జాబ్‌మేళాకు 40వేల మందికి పైగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో మరో 10వేల మందికి పైగా హాజరయ్యారన్నారు. హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన జాబ్‌మేళాకు యువత నుంచి మంచి స్పందన లభించిందన్నారు. హైదరాబాద్ బయటి ప్రాంతంలో మొదటిసారిగా ఏర్పాటుచేసిన ఈ ఉద్యోగమేళాకు భారీగా నిరుద్యోగ యువత హాజరైందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటులో ముఖ్యమైన అంశాల్లో నిరుద్యోగ సమస్య ఒకటన్నారు. దాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 75వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇతర శాఖల్లో ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వరంగంతో పాటు ప్రైవేట్‌రంగంలో కూడా ఉపాధి కల్పించేందుకు దేశం, రాష్ట్రంలో పేరొందిన 275 కంపెనీలను జాబ్‌మేళాకు ఆహ్వానించామన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన పలువురికి ఆఫర్ లెటర్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందజేశారు.

నేటి మెగా జాబ్‌మేళా వాయిదా

కంపెనీల ప్రతినిధుల ఇబ్బందులు, సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో ఆదివారం నిర్వహించాల్సిన జాబ్‌మేళాను నెలరోజులు వాయిదా వేసినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. శనివారం రాత్రి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌మేళాకు 20,463 మంది యువతీ, యువకులు హాజరయ్యారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ధాన్యం దిగుమతుల్లో నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి ఎగుమతయ్యే ధాన్యం దిగుమతుల్లో మిల్లర్లు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. శనివారం మిర్యాలగూడ పరిసరాల్లోని పలు రైస్‌మిల్లుల్లో ధాన్యం ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించి, అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వానాకాలం ధాన్యం సేకరణలో భాగంగా మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలను తక్షణమే సమర్పించాలన్నారు. లేదంటే ధాన్యం సరఫరా నిలిపివేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ సేకరణలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మిల్లుపాయింట్ల వద్దకు వచ్చే ధాన్యం దిగుమతుల్లో కొర్రీలుపెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కనీస మద్దతు ధరను తగ్గించకుండా కొనుగోలు చేయాలని, ఈ విషయంలో అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. తుపాను ప్రభావంతో మిల్లుపాయింట్ల వద్దకు వచ్చే ధాన్యం తడిసే అవకాశం ఉందని, ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం రాశులకు వెంటనే కాంటాలు వేయాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీసీవో వెంకటేష్, సివిల్‌సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, మిర్యాలగూడ రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల్లో భద్రతకు ప్రాధాన్యం

ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వాణి



కమిషనర్ వాణిని సన్మానిస్తున్న ట్రస్మా ప్రతినిధులు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సుల్లో భద్రతకు యాజమాన్యాలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిస్ట్రిక్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వాణి అన్నారు. శనివారం ట్రస్మా ఆధ్వర్యంలో స్కూల్ బస్ డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డ్రైవర్లు క్రమశిక్షణ, జాగ్రత్తతో బస్సులు నడపాలన్నారు. రద్దీ ప్రదేశాలు, జాతీయ రహదారులపై పాటించాల్సిన కనీస జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్లు వాడకుండా, ఓవర్ స్పీడ్‌కు దూరంగా ఉంటూ విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. అనంతరం ఆమెను ట్రస్మా ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంవీఐ చంద్రశేఖర్, స్వప్న, శ్రీనివాస్, ట్రస్మా సభ్యులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసచారి, వరప్రసాద్, శ్యాంసుందర్, శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సలీం, వెంకట్, నర్సిరెడ్డి, దామోదర్, జయరాజు, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు లాటరీ రేపు

రామగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను జిల్లా కేంద్రంలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లాటరీ ప్రక్రియ ద్వారా మద్యం దుకాణాలను ఎంపికచేస్తామని తెలిపారు. 2025-27 సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 1,504 మద్యం దుకాణాలకు 4,906 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. టెండర్ దరఖాస్తులు అందజేసినవారు లాటరీ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

కాంటాలు వేయరు... ధాన్యం కొనుగోలు చేయరు

- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో తప్పని తిప్పలు
- ఆగ్రహించి రోడ్డెక్కిన అన్నదాతలు



మాడ్గులపల్లిలో జాతీయ రహదారిపై మొలకెత్తిన ధాన్యంతో ధర్నా చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. పెరిగిన ఎరువుల ధరలు, చీడపీడల బెడదలాంటి ప్రతికూల పరిస్థితులు రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తీరా పంటను కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే కాంటాలకు నోచక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఒకపక్క ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కాంటాల ప్రక్రియ నత్తనడకన సాగడం రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. మాడుగులపల్లి మండలంలోని 28 గ్రామాల్లో మొత్తం 18వేల మంది రైతులు 32,268 ఎకరాలను వరి సాగు చేయగా 8,600 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. ఎక్కువ మంది రైతులు దొడ్డురకం 1010 సాగు చేయడంతో గ్రేడ్-ఏ రకానికి ప్రభుత్వం మద్దతు ధర రూ.2389, సాధారణ రకానికి ధాన్యానికి రూ.2369 ప్రకటించింది. ఎక్కువ మంది రైతులు దొడ్డురకం సాగు చేయడంతో వర్షాలు సమృద్ధిగా కురవడం, దిగుబడి ఎక్కువగా రావడంతో సంతోషంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఓ వైపు వర్షం, మరోవైపు ఆరని ధాన్యం రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎక్కువ మంది రైతులు ప్రారంభంలోనే వరి పంటను కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగా 10 రోజుల ముందు కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ధాన్యంలో తేమశాతం చూసి సరిగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో కురుస్తున్న వర్షాలకు ఆందోళన చెందిన రైతులు చేసేదేమి లేక మొలకెత్తిన ధాన్యంతో మాడుగులపల్లి మండలకేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా చేపట్టారు. సుమారు గంట వరకు నిరసన తెలపడంతో మాడ్గులపల్లి టోల్ ప్లాజా వరకు ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కృష్ణయ్య, ఏవో శివరాంకుమార్‌లు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. కాగా, మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీసీవో పత్యానాయక్ పలు రికార్డులను పరిశీలించి రైతులు రోడ్డెక్కడానికి గల కారణాలను తెలుసుకొని సెంటర్ ఇన్‌చార్జిని సస్పెండ్ చేయడంతోపాటు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీఈవోకు షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. ఇక నుంచి రైతులకు లారీల కొరత లేకుండా చూడడంతోపాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సజావుగా కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

ధాన్యం తెచ్చి 20 రోజులు అవుతోంది



16 ఎకరాలను కౌలుకు తీసుకొని దొడ్డురకం పంట వేశాను. పంట కోసి 20 రోజులు అయింది. ఐకేపీలోకి తీసుకొచ్చి 20 రోజులు అవుతున్నా కాంటాలు పెట్టడంలేదు. వర్షాలు కురుస్తున్నందున తేమశాతం వచ్చిన వడ్లను వెంటనే కొనుగోలు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలి.

ఎరమాద సైదిరెడ్డి, రైతు, దాచారం

షరతులు లేకుండా కాంటాలు వేయాలి



షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి. ఒక వైపు వాతావరణం సహకరించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం తేమశాతం వస్తే వెంటనే కొనుగోలు చేయాలి. అధికారులు పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం మండల కేంద్రంలో చేపడ్తాం.

పుల్లెంల శ్రీకర్, మాడ్గులపల్లి

వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

కేతేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని నిర్దీత తేమశాతంతో రాగానే వెంటనే కొనుగోలు చేసి వేగవంతంగా ఎగుమతి చేయాలని డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని గుడివాడ, కొత్తపేట గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం, ఇప్పటి వరకు కొనుగోలు, రవాణా చేసిన ధాన్య, కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం వివరాలను, రికార్డులను పరిశీలించారు. శుక్రవారం కురిసిన వర్షానికి కేంద్రంలోని ఎంత మంది రైతుల ధాన్యం తడిసిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తాలు, తేమ లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కాంటాలు వేసిన వెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలని సూచించారు. తేమశాతం, నాణ్యతాప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏపీఎం వలిశెట్టి మల్లేష్, సీసీ రమణయ్య, కమిటీ సభ్యులు రేణుక, నిర్మల, తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ

చిట్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకపోతుల రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం చిట్యాలలో జరిగిన గీత కార్మిక సంఘం జిల్లా మహాసభలో వారు మాట్లాడారు. గీత కార్మికులకు రూ.4వేల పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కరికి కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదన్నారు. రాష్ట్రంలో 760మంది గీత కార్మికులకు రూ.12.60కోట్ల ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉందన్నారు. 23వేల మంది గీత కార్మికులుంటే 20వేల మందికి కాటమయ్య రక్షణ కవచం(సేఫ్టీ కిట్స్) ఇచ్చారని తెలిపారు. రాష్ట్రమంతటా నీరా కేఫ్‌లు ప్రారంభించాలని, హైదరాబాద్ నెక్లస్‌రోడ్‌లో మూతపడిన నీరా కేఫ్‌ను తిరిగి ప్రారంభించాలన్నారు. యాదాద్రి జిల్లా నందనంలో తాటి ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. తాటి ఉత్పత్తులను ప్రభుత్వమే ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ సొసైటీకి ఐదెకరాల భూమి కేటాయించాలని, నాబార్డు ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు సూర్యాపేటలో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సంఘం జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామునగుల్ల అచ్చాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండా వెంకన్న, చెవగోని సీతరాములు, గంజి మురళి, బండ శ్రీశైలం, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, వెంకట్‌గౌడ్, పాల్గొన్నారు.



చండూరు మండలం తాస్కానిగూడెంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.24కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కేతేపల్లి క్రాస్‌రోడ్డు వరకు నిర్మించనున్న పట్టణ పోర్షన్‌రోడ్డు వెడల్పు పనులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పసునూరు నుంచి హైదరాబాద్ రోడ్డు వెంకటంపేట స్టేజీ వరకు రూ.25కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గురుపుజోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏవి.రెడ్డి, నాయకులు పూల వెంకటయ్య, రఘుపతిరెడ్డి, రిషిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటయ్య, పానగంటి వెంకటయ్య, ఎంపీడీవో శర్మ, ఎంఈవో రామకృష్ణ, నక్క యుగేందర్, పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్దతు ధర పొందాలి

(ఆంధ్రజ్యోతి, చండూరు రూరల్): రైతులు దళారుల వద్ద మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ప్రారంభించారు. అనంతరం తాస్కానిగూడెం గ్రామం నుంచి చండూరు పట్టణ కేంద్రం వరకు రూ.13కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులు, చండూరు మండలం ఇడికూడ గ్రామం నుంచి గట్టుప్పల మండలం తేరట్‌పల్లి వరకు రూ.30కోట్లతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో శ్రీదేవి, ఎంపీడీవో యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, నాయకులు పల్లె వెంకన్న, అనంత చంద్రశేఖర్‌గౌడ్, భూతరాజు అంజనేయులు, సుజావుద్దీన్, అబ్బనబోయిన లింగయ్య, లక్ష్మయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో ముసురుతో కూడిన వర్షం

దేవరకొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంతోపాటు గ్రామా ల్లో శనివారం సాయంత్రం ముసురుతో కూడిన వర్షం కురుస్తుంది. వర్షానికి పట్టణం లోని ప్రధాన వీధులు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ముసురుతో కూడిన వర్షంతో పత్తి రైతులు ఆందళన వ్యక్తంచేస్తున్నారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధిక వడ్డీ ఆశతో ప్రజలు మోసపోవద్దు

గుర్రంపోడు, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశతో ప్రజలు మోసాలకు గురికావద్దని గుర్రంపోడ్ ఎస్ఐ పసుపులేటి మధు అన్నారు. శనివారం పోచంపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. డిజిటల్ కరెన్సీ, ట్రేడింగ్ కాయిన్ పేర్లతో, అధిక వడ్డీ పేరుతో కొందరు మోసగాళ్లు అమాయక ప్రజలకు అత్యాశ చూపించి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండి మోసాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వర్షం.. మిగిల్చిన నష్టం

● పంట చేతికందే దశలో నేలపాలవుతున్న వరి
● రంగుమారుతున్న ధాన్యం
● ఆందోళనలో అన్నదాతలు


తిమ్మారెడ్డిగూడెంలో నీట మునిగిన పంట పొలంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు


అకాల వర్షంతో వేములపల్లి శివారులో నేల వాలిన పంట పొలం

వేములపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలతో అన్నదాత అతలాకుతలం అవుతున్నాడు. మరో రెండు రోజుల్లో పంట కోసి ధాన్యం అమ్ముకునేందుకు సిద్ధమైన అన్నదాతకు నిరాశే మిగిలింది. ఆరుగాలం కష్టించి వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికందుతుందనగా నేలపాలవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన సన్న రకం ధాన్యం కోత దశకు చేరుకుంది. దీంతో రైతులు ఇప్పటికే పంట నూర్పిడి చేపట్టగా మరి కొంతమంది రైతులు కోసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ సమయంలో అకాల వర్షం అతలాకుతలం చేసింది. దీంతో లోతట్టు ప్రాంతంలోని పంట పొలాలు నీట మునగగా మెట్ట ప్రాంతంలోని పైరు నేలకొరిగింది. దీంతో వరి రంగు మారిపోవడంతోపాటు మొలకెత్తుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట నూర్పిడి చేపట్టేందుకు అవకాశం లేకపోగా అరకొరగా కోసిన ధాన్యం రంగుమారడంతో అమ్ముకునేందుకు దిక్కుతోచని పరిస్థితిలో మిల్లర్ల వైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.40వేల మేర పెట్టుబడి పెట్టడంతో పాటు ఒక్కొక్క ఎకరాకు 14 నుంచి 16 బస్తాల కౌలు చెల్లించాల్సి రావడంతో కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఈ పంట నేలవాలడంతో కోసే పరిస్థితి లేక కూలీలతో పంటను నిలిపి కట్ట కట్టేందుకు అదనంగా కూలీ చెల్లించిరావడంతో మరింత ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని గుర్తించకపోవడం బాధాకరమని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నష్ట పరిహారం అందించాలి



అకాల వర్షంతో నీట మునిగి దెబ్బ తిన్న పంటకు ప్రభుత్వపరంగా నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి. తాను మూడెకరాల్లో చింట్లు సన్నరకం ధాన్యాన్ని సాగు చేశాను. గురువారం పంటను కోసేందుకు సిద్ధమయ్యాను. ఒక్కసారిగా వర్షం కురవడంతో రెండు రోజులుగా పంట నేలవాలి నీటిలో నానిపోతుంది. దీంతో ధాన్యం రంగు మారడంతో పాటు మొలకెత్తుతుంది. మరో ఒకట్రెండు రోజుల్లో ఇలాగే నీట మునిగి ఉంటే పంట పూర్తిగా కుళ్లిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ. 35 వేల మేర పెట్టుబడులు పెట్టాను. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

కత్తుల శ్రీను రైతు, తిమ్మారెడ్డిగూడెం

భక్తిశ్రద్ధలతో నాగులచవితి


హాలియాలో పూజల్లో పాల్గొన్న భక్తులు

వేములపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వేకువజాము నుంచే గ్రామ సమీపంలోని నాగదేవతల పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిపాలెం గ్రామంలోని ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పంచామృత రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని శ్రీభక్త మార్కండేయ భవాని మాత దేవాలయంలో నాగుల చవితిని పురస్కరించుకొని ఎల్లమ్మ పుట్ట వద్ద పంచామృత అభిషేకం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వనం సుజాత జగదీశ్వర్, మణిదీప్, శేరిపల్లి జయలక్ష్మి, ఎల్లయ్య, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

హాలియా: నాగులచవితిని హాలియాలో ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం వద్ద ఉన్న పుట్టల వద్ద మహిళా భక్తులు తెల్లవారుజామునుంచే పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు నాగులచవితి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్చకుడు గోవర్ధన రాఘవాచార్యులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలో నాగుల చవితి పూజలు భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. శివాలయాలతోపాటు తాళ్లగడ్డలోని ఆంజనేయస్వామి ఆలయంలోని పుట్టను దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమాల్లో కోల సైదులు, కొంపెల్లి యాదగిరి, బంటు సైదులు, శ్రీకాంత్, మురళీ, శేఖర్, సంజీవరెడ్డి, ఉమేష్ పాల్గొన్నారు.

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు గ్రామంలో పార్వతి బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాగుల చవితి సందర్భంగా శనివారం పూజలు నిర్వహించారు. అర్చకుడు అన్నెపర్తి శివాజీశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నాగుల చవితిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వెంకటాచార్యులు, మహిళలు పాల్గొన్నారు.

చింతపల్లి: నాగుల చవితిని పురస్కరించుకొని చింతపల్లితోపాటు వేంకటేశ్వరనగర్‌లో మహిళలు నాగదేవతకు శనివారం పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో నాగదేవతకు మహిళలు పూజలు చేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఇస్లావత్ కృష్ణ అన్నారు. జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. అనంతరం మాట్లా డుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన రన్నింగ్ పోటీలో బీ.గోపిచంద్ ప్రథమ స్థానంలో నిలవగా, చదరంగం పోటీ ల్లో భరత్ ద్వితీయస్థానం, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో రాగ్యానాయక్ ఫస్ట్ ప్రైజ్ సాధించడం ఆదర్శనీయమన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్యకై పేరొందిన విద్యాలయాల్లో ప్రవేశాలు సులభతరం అవుతాయన్నారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

హాలియా, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నేడు ఆదివారం త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంలో చలకుర్తి, ప్రస్తుత నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రాంమూర్తియాదవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అనుముల మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అనుముల మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాంమూర్తియాదవ్ అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని ఆయనకు నివాళులర్పించాలని కోరారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ● నిడమనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిడమనూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నిడమనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. రైతుల అభ్యున్నతికి దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో బోనగిరి రమేష్, మార్కెట్ కార్యదర్శి తోట చందర్‌రావు, పీఏసీఎస్ కార్యదర్శి బుచ్చాల జానయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, నాయకులు నందికొండ మట్టారెడ్డి, వల్లభ్‌రెడ్డి, శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగు విజయ్, బొల్లం శ్రీను, గడ్డం గోవిందరెడ్డి, విశ్వనాధుల రమేష్ పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి

త్రిపురారం: గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామారెడ్డిగూడెం గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మించిన నూతనంగా గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమాళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ సలహాదారుడు అనుముల శ్రీనివాస్‌రెడి, నిడ్మనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, అనుముల వెంకట్‌రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, జానయ్యపాల్గొన్నారు.

పెద్దవూర: మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన ఇరుమాది హనుమంతరెడ్డి వెంకటమ్మ కుమారుడు రవీందర్‌రెడ్డి శృతిల వివాహ వేడుక సందర్భంగా నూతన వధూవరులను ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆశీర్వదించారు.

తిరుమలగిరి(సాగర్): గ్రూప్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన గిరిజన యువకుడిని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అభినందించారు. మండలంలోని ఎర్రచెరువుతండాకు చెందిన రమావత్ సాగర్ గ్రూప్-2 పరీక్షలో రాష్ట్రస్థాయిలో 1,125వ ర్యాంకు సాధించి మండలపంచాయతీ ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యారు.

తాగునీటి సరఫరాలో ఆధునిక పద్ధతులు


అధికారులతో కలిసి ఖమ్మంలో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాలో ఆధునిక పద్ధతులు అవలంబించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ తాగు నీటి శుద్ధి, సరఫరాలో అత్యాధునిక పద్ధతులు పాటిస్తున్న ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌ను ఇంజనీర్లతో కలిసి సందర్శించినట్లు తెలిపారు. డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానానికై ప్రాజెక్టు రూపకల్పన, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి నాణ్యత పర్యవేక్షణ విధానం సమర్థవంతంగా ఉందన్నారు. అదే విధానాన్ని పట్టణంలో అమలుపరచి ప్రజలకు శుద్ధమైన జలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయనవెంట అధికారులు వెంకన్న, అంజయ్య, మునిసిపల్, పబ్లిక్ హెల్త్ శాఖల ఇంజినీర్లు ఉన్నారు.

డీసీసీ పదవి బీసీలకు కేటాయించాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): డీసీసీ పదవి బీసీలకు కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం బీసీ భవన్‌లో మాట్లాడుతూ నామినేటెడ్ పదవులన్నీ అగ్రవర్ణాలకే కట్టబెట్టిన కాంగ్రెస్ పార్టీ బీసీలకు మొండి చేయి చూపిందన్నారు. సమావేశంలో రాష్ట్రనేత పగిడి జీడయ్యయాదవ్, నాగేశ్వరరావు, మురళీ, గంగాధర్, సాయి, నరేష్, మహేందర్, ఉదయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నాగార్జునసాగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పెద్దవూర ఎంఈవో తరి రాములు అన్నారు. శనివారం ఆయన నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో వేమూరి అబిరామేశ్వర్‌రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అభ్యసన దీపికలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషు, రాజబాబు, అంజయ్య, లాలు పాల్గొన్నారు.

బొమ్మలతో బోధన చేయాలి

చింతపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతోపాటు బొమ్మలతో బోధన చేయాలని సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. శనివారం చింతపల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో విద్యాబోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.26.85 లక్షలతో తరగతి గదుల మరమ్మతు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. విద్యా వ్యవస్థకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యమని, విద్య పేరుతో పాలకులు దోచుకుతిన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో దేవరకొండ ఎంపీడీవో డానియెల్ పాల్గొన్నారు.

పద్మశాలీ భవనానికి నిధులు కేటాయించాలి

దేవరకొండ పట్టణంలో పద్మశాలీల సంఘం భవనానికి స్థలం కేటాయించి, భవనాన్ని నిర్మించాలని సంఘం నేతలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల శ్రీనివాస్, పగిడిమర్రి నాగరాజు, వినయ్‌కుమార్, మురళీ వినతిపత్రం అందజేశారు.

జైపాల్‌రెడ్డిగా నామకరణం చేసేందుకు కృషి

దేవరకొండ బాలుర జూనియర్ కళాశాలకు మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి పేరు నామకరణం చేసే విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్టు సభ్యులు చిలువేరు కాశినాధ్, మార్కెట్‌కమిటి చైర్మన్ జమున మాధవరెడ్డి, ఆలంపల్లి నర్సింహ, పల్లా నర్సింహరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సుంకరి రమేష్, పూర్వ విద్యార్థులు రాము చౌహాన్, లాలునాయక్, శ్రవణ్, కొండయ్య, రాజేష్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డిండి: ప్రజా సమస్యల పరిష్కారానికే జనహిత మార్నింగ్‌వాక్ అని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో జనహిత ఎమ్మెల్యే మార్నింగ్‌వాక్ విత్ పీపుల్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎర్రగుంటపల్లిలో బీటీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకన్న, పంచాయతీరాజ్ డీఈ లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, యాదగిరిరావు, హనుమంతు రెడ్డి, దామోదర్‌రావు, రాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి: పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని శివసాయి కాటన్ మిల్లు వద్ద సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, ముచ్చర్ల యాదగిరి, ఎరుకుల వెంకటయ్యగౌడ్, మార్కెట్ కార్యదర్శి వేణుకుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లశాఖలో షాడో ఆఫీసర్

(5వ పేజీ తరువాయి)

చిన్న సార్ చెప్పిన విధంగానే ఫైల్‌ను కదిలించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఆ సొసైటీ సభ్యులు తిరిగి కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. సొసైటీకి సంబంధించిన ఓ వర్గం సభ్యులు ఆ ఫైల్‌ను నిలిపివేయాలని రాతపూర్వకంగా జిల్లా డీఆర్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేశారు. అయినా తనకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని పేర్కొంటూ ఫైల్‌ను కదలించడం విమర్శలకు తావిచ్చింది. ఈ విషయంలో జిల్లా కార్యాలయంలోని సదర్ సెక్షన్ ఉద్యోగే అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి రిజిస్ట్రేషన్ అధికారులు సెక్షన్-23 ప్రకారం జనరల్ బాడీ తీర్మానాలను పరిశీలించి, వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, ఇక్కడ అందుకు విరుద్ధంగా వ్యవహరించారు.

డీఆర్ కార్యాలయంలో ఆయనే షాడో ఆఫీసర్

జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆయనే షాడో ఆఫీసర్‌గా వ్యవహరిస్తుండటంతో ఇతర ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. సెక్షన్ల సర్దుబాటు విషయంలో అధికారుల తప్పిదాలు బయట పడుతున్నాయి. సీనియర్ ఉద్యోగులకు ఎలాంటి ప్రాధాన్యం లేని సెక్షన్లు అప్పగిస్తూ అవగాహన లేని వారైనా సరే అనుకూలంగా ఉన్న వారికి కీలకమైన సెక్షన్లు కట్టబెడుతున్నారు. దీంతో డీఆర్ కార్యాలయంలో కొంతకాలంగా గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇతర ఉద్యోగుల పనుల్లో జోక్యం చేసుకుంటుండటంతో సెక్షన్లలో పనులన్నీ మందకొడిగా సాగుతున్నాయి. పక్క సెక్షన్లలో ఫైళ్లను కూడా తానే పరిశీలిస్తాననేలా సదరు సార్ వ్యవహరించడం వివాదాస్పదంగా మారుతోంది. ఉన్నతాధికారులు సైతం వారు కేవలం ఇన్‌చార్జీలు అనే భావనతో సెక్షన్లలోని గందరగోళాన్ని, ఉద్యోగుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. దీంతో తోటి ఉద్యోగులపై ఆ చిన్న సార్ పెత్తనం పెరిగింది. దీన్ని నివారించకపోవడంతో కార్యాలయంలోని ఇతర ఉద్యోగులు ఇబ్బందులుపడుతున్నారు. అదేవిధంగా ఆ చిన్న సార్ ఉమ్మడి జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఫోన్‌చేసి పెత్తనం చేస్తున్నట్లు తెలిసింది. జిల్లా కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానంటూ వారిపై అజమాయిషీ చేసేలా వ్యవహరిస్తుండటంతో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ పాలనగాడి తప్పుతోంది.

అక్రమాలు, అవకతవకలకు అవకాశం ఉండదు

ఒక సెక్షన్ ఉద్యోగి ఇతర సెక్షన్లలో జోక్యం చేసుకునే అవకాశం ఉండదు. అక్రమాలకు, అవకతవకలకు తావు ఉండదు. తాను ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో అలాంటి వాటికి అవకాశం ఉండే ప్రసక్తే లేదు. ఏమైనా ఫిర్యాదులు వస్తే పరిశీలన చేస్తాం. సెక్షన్లకు సంబంధించి కూడా ఎప్పటికప్పుడూ సమీక్ష ఉంటుంది. అంతే తప్ప ఒక ఉద్యోగి ఇతర ఉద్యోగులను ఇబ్బందులను గురి చేయడం అనేది ఉండదు. సొసైటీలకు సంబంధించి ఇబ్బందులు ఉంటే ఫిర్యాదులు చేస్తే పరిష్కరిస్తాం.

ఎం.రవీందర్‌రావు, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

నష్ట పరిహారం అందించాలి

వేములపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లానేత కట్టా మల్లేష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామ శివారులోని అకాల వర్షానికి నేలవాలి దెబ్బతిన్న పంట పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని, ఇప్పటికే రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న పంట పొలాలు నీట మునిగినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు సర్వే నెంబర్ల వారీగా పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వేణు, సైదులు, శ్రీధర్, వీరస్వామి, రాములు, వెంకన్న, నాగయ్య, అశోక్‌రెడ్డి, సైదిరెడ్డి, రవి, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా సదర్ వేడుకలు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దున్నపోతు ఆట చూడు.. యాదవుల సదర్ చూడన్నా.. అంటూ పీఏపల్లి మండలకేంద్రంలో శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదర్ వేడుకలు వైభవంగా సాగాయి. డప్పుల మోత.. డీజే చప్పుళ్ళ, దున్నపోతుల ఆటలతో అప్రాంతమంతా కోలాహలంగా మారింది. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన కుంటిగోర్ల నర్సింహ యాదవ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గోర్ల వెంకటయ్య, కొండల్, శంకర్, రాంబాబు, అన్వేష్, ఆంజనేయులు, యల్లేష్ పాల్గొన్నారు.